విశాల భారతి

25-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 114

మానని గాయం..!

కోటి ఇస్తామని చెప్పి రూ. 42 లక్షలే ఇచ్చి కంపెనీ మొండిచేయి

- 10 నెలలైనా గల్లంతైన 8 మంది కార్మికుల జాడ లేదు
- సాకులు చెబుతున్న యాజమాన్యాన్ని వివరాలడిగిన హైకోర్టు
- క్షతగాత్రుల చికిత్స ఖర్చులను కంపెనీ భరించడం లేదు
- న్యాయం కోసం కలెక్టరేట్ ఎదుట కుటుంబాల నిరసన
- పరిష్కారం లేకపోతే సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడికి సిద్ధం

03

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పారిశ్రామిక వాడల చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. 2025 జూన్ 30న సంభవించిన ఈ భీకర పేలుడు 46 మంది కార్మికుల ప్రాణాలను బలితీసుకోగా మరో 8 మంది కార్మికుల ఆచూకీ నేటికీ లభించలేదు. ప్రమాదం జరిగి పది నెలలు గడుస్తున్నా బాధితులకు లభించిన ఊరట కంటే మిగిలిన గాయాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించిన యాజమాన్యం ఆచరణలో మాత్రం అడుగడుగునా నిబంధనల సాకులు చూపుతూ కాలయాపన చేస్తోంది. కోటి రూపాయల పరిహారం ప్రకటన కేవలం కాగితాలకే పరిమితమైందా అన్న అనుమానాలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

చర్చలు సఫలం.. బస్సులు రైట్ రైట్

- ప్రభుత్వంతో జేఏసీ చర్చలు సఫలం; సమ్మె విరమణకు గ్రీన్ సిగ్నల్
- శనివారం ఉదయం నుంచే రోడ్డెక్కనున్న ఆర్టీసీ బస్సులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల భేటీ
- వేతనాలు, పెన్షన్ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం
- సమ్మె విరమిస్తున్నట్లు జేఏసీ నుంచి అధికారిక ప్రకటన
- స్తంభించిన రవాణా వ్యవస్థ పునరుద్ధరణ; ప్రయాణికులకు ఊరట

02

2019 52 రోజులు 25 మంది మృతి

విధుల్లో చేరని వారిపై డిస్మిస్ వేటు హెచ్చరిక

2019లో 26 డిమాండ్లతో 48 వేల మంది ఆందోళన

52 రోజుల సమ్మెలో 25 మంది మృతి

హైకోర్టు సూచనతో షరతులు లేకుండా సమ్మె ముగింపు

కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్న కేసీఆర్

డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యతో మళ్లీ ఉద్రిక్తత

తెలంగాణ రవాణా రంగ చరిత్రలో 2019 అక్టోబరు నెల ఒక చెరగని ముద్ర వేసింది. దసరా పండగ పూట రాష్ట్రమంతా వేడుకల్లో మునిగిపోవాల్సిన తరుణంలో సమ్మె సైరన్ మోగింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం సహా 26 ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలంటూ సుమారు 48,000 మంది కార్మికులు ఏకతాటిపైకి వచ్చారు. నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారుతో అమీతుమీ తేల్చుకునేందుకు సమ్మె బాట పట్టారు. పండుగ పూట ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా తమ అస్తిత్వం కోసం ఉద్యోగులు విధులను బహిష్కరించి రోడ్లపైకి చేరారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమ్మెను తీవ్రంగా పరిగణించి అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వం విధించిన గడువులోగా విధుల్లో చేరని వారందరినీ ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం దేశవ్యాప్త చర్చకు దారితీసింది.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కేవలం 1,200 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని మిగిలిన వారు స్వయంకృతాపరాధంతో ఉద్యోగాలు పోగొట్టుకున్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిణామం కార్మికుల్లో తీవ్ర భయాందోళనలు కలిగించింది. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేటు డ్రైవర్లు, కండక్టర్లను రంగంలోకి దించి బస్సులను నడిపించే ప్రయత్నం చేసింది. ఊహించని ఈ పరిణామాలతో కార్మిక సంఘాల నేతలు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. స్వరాష్ట్రంలో తమ హక్కుల కోసం ఇంతటి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని వారు భావించలేదు. సమ్మె కొనసాగుతున్న కొద్దీ విషాద చాయలు అలుముకున్నాయి. ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఒకవైపు, ఆర్థిక ఇబ్బందులు మరోవైపు కార్మికులను కుంగదీశాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కొందరు మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడితే మరికొందరు గుండెపోటుతో మరణించారు. ప్రతి మరణం ఉద్యమానికి ఒక రక్తాక్షరాలుగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ స్తంభించిపోవడంతో సామాన్యులు పడరాని పాట్లు పడ్డారు. ప్రైవేటు వాహనాల దోపిడీతో జనం ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం మాత్రం కార్మికులతో చర్చలకు ససేమిరా అంది. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మరణం ఈ పోరాటంలో అత్యంత బాధాకరమైన ఘట్టం. నర్సంపేట బస్టాండ్‌లో జరుగుతున్న నిరసనలో పాల్గొన్న ఆయన తన శరీరానికి నిప్పు అంటించుకున్నారు. తీవ్ర గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చేరినప్పటికీ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున శంకర్ గౌడ్ తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనతో వరంగల్ జిల్లా అట్టుడికిపోయింది. కార్మిక జేఏసీ జిల్లా బంద్‌కు పిలుపునివ్వడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. హనుమకొండ డిపో ఎదుట కార్మికులు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. న్యాయపోరాటంలో భాగంగా ఈ వివాదం తెలంగాణ హైకోర్టు మెట్లెక్కింది. ప్రభుత్వం, కార్మిక సంఘాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ధర్మాసనం సూచించింది. కోర్టు మధ్యవర్తిత్వం వహించినప్పటికీ ప్రభుత్వం చర్చలకు సిద్ధపడకపోవడంతో సందిగ్ధత నెలకొంది. సుమారు 52 రోజుల పాటు సాగిన ఈ సుదీర్ఘ పోరాటం చివరకు మిగతా 2లో..

కవిత కొత్త పార్టీ

'తెలంగాణ ప్రజావికాస్ సమితి'

పార్టీ గుర్తుగా 'ధర్మగంట' ప్రతిపాదన

కాకతీయ తోరణం, గోల్కొండ కోట చిత్రాలు

పాత పేరు 'ప్రజా జాగృతి' స్థానంలో కొత్త పేరు

పార్టీ పేరు బీఆర్ఎస్, టీఆర్ఎస్‌లకు దగ్గరగా

03

బీజేపీలోకి ఆప్ ఎంపీల జైత్రయాత్ర

- 10 మంది ఆప్ రాజ్యసభ ఎంపీలలో 7 గురు బీజేపీలోకి
- అనర్హత పడకుండా 2/3 వంతు మంది కలిసి నిర్ణయం
- రాఘవ్ చద్దా, హర్భజన్, స్వాతి మలివాల్ వంటి వారు విడారు

03

ఆత్మహత్యలొద్దు..!

- శంకర్ గౌడ్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
- 100 రోజుల్లో విలీనం చేస్తామన్న కాంగ్రెస్ మాట తప్పింది
- ఆర్టీసీ కార్మికుల దీక్షకు బీజేపీ పూర్తి మద్దతు
- కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కార్మికులను మోసం చేశాయి
- బస్సులు లేక 60 లక్షల మంది ప్రయాణికుల ఇబ్బందులు

02

గులాబీ అగ్రనేతలకు విముక్తి

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లపై కేసులను కొట్టేసిన హైకోర్టు
- 2011 నాటి మిలియన్ మార్చ్ ఉద్యమ కేసులు ఇవి
- గొడవలతో నేతలకు సంబంధం లేదని కోర్టు స్పష్టీకరణ
- దశాబ్ద కాలంగా ఉన్న క్రిమినల్ కేసుల నుంచి ఊరట
- అభియోగాలు రద్దు చేయాలన్న నేతల అభ్యర్థన సఫలం
- తీర్పు పట్ల బీఆర్ఎస్ శ్రేణుల సంతోషం

04

రేవంత్, మంత్రులు త్యాగాలకు సిద్ధం

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ (రూ. 10 వేల కోట్లు) చెల్లింపు కోసం 50శాతం కోత ద్వారా నెలకు సుమారు రూ. 2.27 కోట్లు ఆదా

ఆర్థిక కష్టాల్లో ఉన్న హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నుండి స్ఫూర్తి

భారీ ఎన్నికల హామీల అమలు, పెరిగిన అప్పుల భారం

కమిటీ నివేదిక అనంతరం అమలుపై రేవంత్ రెడ్డి తుది నిర్ణయం

సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం కోతకు ప్రతిపాదన

02

పాల్వంచలో విద్యార్థినికి హాల్ టికెట్ నిరాకరణపై ఆగ్రహం

- కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు
- కావాలనే నా కూతురు జీవితం నాశనం చేసారు
- బోరున విలపించిన విద్యార్థి తల్లి దండ్రులు

పాల్వంచ విశాలభారతి:

పాల్వంచ లోని కే ఎల్ ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లొమా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న పేరుబోయిన స్వర్ణంబిక అనే విద్యార్థినికి హాల్ టికెట్ నిరాకరించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లి దండ్రులు. మణుగూరు సుందరయ్య నగర్ కు చెందిన ఈ విద్యార్థిని ప్రతిరోజూ మణుగూరు నుంచి పాల్వంచ లోని కాలేజీకి, కాలేజీ బస్ వాస్తు ఉండేది, చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని గా గుర్తింపు పొందింది. రోజు వారీగా బస్సులో ప్రయాణిస్తున్న క్రమంలో, జనవరి నెలలో మొండికుంట సమీపంలో కె ఎల్ ఆర్ కాలజీ బస్సు రోడ్డు ప్రమాదానికి గురై ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రమాదంలో చేతి నరాలు దెబ్బతినడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డ ఈ విద్యార్థిని ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో బెడ్ రెస్ట్‌లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి క్లిష్ట సమయంలో విద్యార్థినికి అండగా నిలవాల్సిన కాలేజీ యాజమాన్యం బాధ్యత మరిచి తప్పించు కుంటోందనే, ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్య ఖర్చులు మరియు పరీక్షలు రాయడానికి పూర్తి సహకారం అందిస్తామని కాలేజీ యాజమాన్యం ముందుగా హామీ ఇచ్చినట్లు తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ప్రిన్సిపాల్‌ను పలుమార్లు సంప్రదించగా..., విద్యార్థి పరీక్ష రాయడానికి అవసరమైన పత్రాలను యూనివర్సిటీకి పంపించాలని కోరినా ప్రిన్సిపాల్. స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మధ్యాహ్నం ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా "అటెండెన్స్ తక్కువగా ఉండడంతో హాల్ టికెట్ ఆమోదం పొందలేదని, పరీక్షలకు అనుమతి లేదు" అని ఒక్కసారిగా తెలియజేయడంతో తల్లిదండ్రులను తీవ్రంగా కలిచివేసింది. కాలేజీలో ఫీజులు కట్టి చివరి సంవత్సరంలో బిడ్డ జీవితం ఎక్కడ ఆగిపోతుందని ఆ తల్లి కన్నీరుమున్నిరైంది. మూడు నెలల పాటు హామీలు ఇచ్చి, చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం కాలేజీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరి పైకి అద్దం పడుతుంది. విద్యార్థిని వైద్య సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా అటెండెన్స్ పేరుతో హాల్ టికెట్ నిరాకరించడం అన్యాయమని తల్లి దండ్రులు మండిపడుతున్నారు. ఈ నిర్ణయంతో ఆగ్రహానికి గురైన విద్యార్థిని తల్లిదండ్రులు శుక్రవారం కాలేజీ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్‌తో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విద్యార్థిని భవిష్యత్తు పణంగా పెట్టి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కాలేజీ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విద్యార్థిని వైద్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మినహాయింపులు ఇవ్వాల్సిన బాధ్యత కాలేజీపై ఉందని అభిప్రాయ పడుతున్నారు.

చర్చలు సఫలం.. బస్సులు రైట్ రైట్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఆర్టీసీ సమ్మె ఎట్టకేలకు ముగింపు దశకు చేరుకుంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు నిర్వహించిన చర్చలు సానుకూల వాతావరణంలో ముగియడంతో సమ్మె విరమణకు మార్గం సుగమమైంది. శనివారం వేకువజాము నుంచే రాష్ట్రంలోని 96 డిపోల పరిధిలో బస్సులు యథావిధిగా నడవనున్నాయి. రవాణా సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డ సామాన్య ప్రయాణికులకు ఈ పరిణామం పెద్ద ఊరటనిచ్చింది. సమ్మె కారణంగా నిలిచిపోయిన సుమారు 9,500 బస్సు సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సమావేశం సుమారు ఐదు గంటల పాటు కొనసాగింది. ఈ కీలక భేటీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. జేఏసీ నేతలు తమ ముందుంచిన 14 ప్రధాన డిమాండ్లపై మంత్రుల బృందం లోతుగా చర్చించింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో కార్మిక సంఘాల నేతలు ఆందోళన విరమించేందుకు అంగీకరించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన 2017 పీఆర్సీ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. సుమారు 380 కోట్ల రూపాయల మేర ఉన్న ఈ నిధులను వచ్చే మూడు నెలల్లో విడతల వారీగా విడుదల చేసేందుకు మంత్రులు అంగీకరించారు. దీనితో పాటు పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యం పెంపునకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల సంస్థపై ప్రతి నెలా సుమారు 4.5 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం పడనుంది. అయినప్పటికీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ భారాన్ని భరించేందుకు సర్కారు సిద్ధమైంది. సంస్థలో పనిచేస్తున్న సుమారు 48,500 మంది ఉద్యోగుల వేతన సవరణ అంశంపై కూడా ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే బడ్జెట్‌లో ఆర్టీసీకి కేటాయింపులు పెంచి, వేతన ఒప్పందాన్ని ఖరారు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్ల పని వేళల నియంత్రణకు సంబంధించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తగ్గి మెరుగైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని యాజమాన్యం భావిస్తోంది. కార్మికులకు చెల్లించాల్సిన బాకీలను ఎప్పటికప్పుడు సర్దుబాటు చేసేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నారు. మహాలక్ష్మి పథకం అమలు వల్ల సంస్థ ఆదాయంలో వస్తున్న హెచ్చుతగ్గులపై జేఏసీ నేతలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అందాల్సిన రీయింబర్స్‌మెంట్ మొత్తాలను ప్రతి నెలా 10వ తేదీ లోపు చెల్లించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సుమారు 1,200 కోట్ల రూపాయలు సంస్థకు విడుదల కాగా, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరగా అందించాలని కోరారు. ఆదాయ మార్గాలను మెరుగుపరిచేందుకు కొత్తగా 1,500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రవేశపెట్టే ప్రతిపాదనపై కూడా చర్చ జరిగింది. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ల సమస్యపై మంత్రుల బృందం మానవతా దృక్పథంతో స్పందించింది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కమ్యుటేషన్ నిధులను విడుదల చేసేందుకు సుమారు 150 కోట్ల రూపాయలు తక్షణమే కేటాయించారు. దీనివల్ల వేలాది మంది మాజీ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. వైద్య సౌకర్యాల విషయంలో కార్పొరేట్ ఆసుపత్రులకు ఉన్న బకాయిలను తీర్చి, ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న డిస్పెన్సరీలను ఆధునీకరించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. సమావేశం ముగిసిన తర్వాత జేఏసీ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం చూపిన చొరవ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గత పాలకుల హయాంలో జరగని చర్చలు ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. సమ్మె కాలంలో ఎదురైన ఇబ్బందులను ప్రజలు గమనించాలని కోరారు. ప్రభుత్వ హామీల మేరకు శనివారం నుంచి విధుల్లోకి చేరుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికులు ఎక్కడికక్కడ సమ్మె విరమణ వేడుకలు జరుపుకుంటున్నారు. డిపోల వద్ద ఉద్రిక్త వాతావరణం తొలగిపోయి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. నియోజకవర్గ స్థాయిలో కూడా ఈ సమ్మె ప్రభావం తీవ్రంగా ఉండటంతో ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వంటి వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తమ ప్రాంతాల్లోని రవాణా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో విద్యార్థులు, రైతులు ఎదుర్కొన్న కష్టాలను వివరించారు. దీనివల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి చర్చల ప్రక్రియ వేగవంతమైంది. ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంత్రుల బృందం ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది. చర్చల సారాంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివేదించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంతో సమ్మె విరమణ ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అక్రమంగా విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి చేర్చుకునేందుకు కూడా ప్రభుత్వం సమ్మతించింది. ఇది కార్మిక వర్గాల్లో పండుగ వాతావరణాన్ని నింపింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. సమ్మె ముగింపుతో ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయి. ప్రైవేట్ వాహనదారుల దోపిడీకి అడ్డుకట్ట పడనుంది. సుమారు 1.2 కోట్ల మంది నిత్యం ప్రయాణించే ఆర్టీసీ బస్సులు తిరిగి రోడ్డెక్కడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. వారాంతం కావడంతో ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రధాన నగరాల నుంచి పల్లెలకు వెళ్లే సర్వీసులపై ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని డిపోల మేనేజర్లు సిబ్బందికి తక్షణమే సమాచారం అందించి సర్వీసులను సిద్ధం చేస్తున్నారు. మొత్తానికి తెలంగాణ ఆర్టీసీ సమ్మె సుఖాంతం కావడంతో ఒక పెద్ద రాజకీయ, సామాజిక సంక్షోభం తొలిగిపోయింది. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య ఏర్పడిన ఈ సమన్వయం భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి బాటలు వేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా రవాణా రంగాన్ని లాభాల్లోకి తీసుకురావడంలో కార్మికులు కీలక పాత్ర పోషించాలని మంత్రులు కోరారు. కార్మికుల సంక్షేమానికి తాము పెద్దపీట వేస్తామని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ పరిణామంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. నేటి నుంచి తెలంగాణ రోడ్లపై ఎర్ర బస్సులు తిరిగి గంట కొట్టనున్నాయి.

ఆత్మహత్యలొద్దు..!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. కార్మికులు ఎవరూ అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని, సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. శంకర్ గౌడ్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న మొండి వైఖరి వల్లే ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్న సత్యాన్ని ఈ ఘటన నిరూపిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని 39 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు ప్రస్తుతం దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కార్మికులు సమ్మెకు దిగినప్పుడు అప్పటి ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి వేధించిన తీరును ఆయన గుర్తు చేశారు. ఆ పోరాట సమయంలో దాదాపు 20 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. దాదాపు 52 రోజుల పాటు సాగిన సుదీర్ఘ సమ్మెలో తాము కార్మికులకు అండగా నిలబడి జైలుకు కూడా వెళ్ళామని వివరించారు. ఆనాడు బీజేపీ చేసిన పోరాట ఫలితంగానే అప్పటి ప్రభుత్వం దిగివచ్చిందని, ఇప్పుడు మళ్ళీ అదే తరహా పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అభయ హస్తం హామీలు ఇప్పుడు ప్రజల పాలిట భస్మాసుర హస్తాలుగా మారాయని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని మేనిఫెస్టోలో స్పష్టంగా పొందుపరిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పిన పాలకులు, ఇప్పుడు 900 రోజులు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చమని కార్మికులు కోరడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని, గత పాలకుల బాటలోనే పయనిస్తూ కార్మికులను వంచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో హామీలు ఇచ్చేటప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి చేశారా అని బండి సంజయ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తమను మోసం చేసిందనే ఆగ్రహంతోనే కార్మికులు కాంగ్రెస్‌కు ఓటు వేశారన్న విషయాన్ని పాలకులు మరవకూడదన్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీల పేరుతో కాలయాపన చేయడం కేవలం బాధ్యతల నుంచి తప్పుకోవడమే అవుతుందని ఆయన అభివర్ణించారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించకుండా కొత్త కమిటీలను నియమించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తేల్చి చెప్పారు. తక్షణమే ప్రభుత్వం చర్చలకు పిలిచి వారిని ఒప్పించి, సమస్యలకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. మంత్రుల వేతనాల్లో 50 శాతం కోత విధిస్తామన్న ప్రతిపాదనలు కేవలం కంటితుడుపు చర్యలేనని సంజయ్ కొట్టిపారేశారు. తెలంగాణ ప్రజల రక్తాన్ని పిండి వసూలు చేస్తున్న సొమ్ము ఢిల్లీ, తమిళనాడు, కేరళ, అస్సాం వంటి రాష్ట్రాలకు తరలిపోతోందని ఆరోపించారు. మంత్రులు అక్రమంగా సంపాదించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తుల్లో సగం అమ్మినా కార్మికుల కష్టాలు తీరుతాయని ఘాటుగా విమర్శించారు. నిధుల కొరత సాకుతో కార్మికుల పొట్ట కొట్టడం సరికాదని హితవు పలికారు. కార్మికుల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన దీక్షకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని బండి సంజయ్ ప్రకటించారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలను ఆయన తప్పుబట్టారు. లైసెన్స్ లేని వారికి, సరైన శిక్షణ లేని వారికి తాత్కాలిక ఉద్యోగాలు ఇచ్చి బస్సులను నడిపించడం వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడిపించి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. ప్రభుత్వం బెదిరింపులకు దిగడం మానుకుని, మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు. కార్మికులు ఎవరూ ఆవేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు చాలా విలువైనవని హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల బస్సులు డిపోలకే పరిమితం కావడం వల్ల రవాణా వ్యవస్థ స్తంభించిపోయిందని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ సుమారు 60 లక్షల మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇతర అంశాలపై చూపుతున్న శ్రద్ధను ప్రజా రవాణా వ్యవస్థపై చూపకపోవడం శోచనీయమన్నారు. సామాన్యుల కష్టాలను పట్టించుకోకుండా కాలక్షేపం చేయడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణానంతర జీవితం అత్యంత దయనీయంగా మారుతోందని కేంద్ర మంత్రి వివరించారు. సర్వీసు నుంచి తప్పుకున్నాక వారికి లభించే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ కంటే తక్కువగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. బ్యాంకులు సైతం వీరికి రుణాలు ఇచ్చేందుకు వెనుకాడుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జేబులో చిల్లి గవ్వ లేని స్థితిలో కార్మికులు బతుకుతున్నారని, వారి ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. సమాజంలో గౌరవంగా బతకాల్సిన కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బండి సంజయ్ గుర్తు చేశారు.

రేవంత్, మంత్రులు త్యాగాలకు సిద్ధం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహా మంత్రులు తమ వేతనాల్లో ఏకంగా 50 శాతం కోతకు సిద్ధపడటం సర్వత్రా చర్చనీయాంశమైంది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రధానంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన ప్రయోజనాలు, నిలిచిపోయిన బకాయిలపై సుదీర్ఘంగా మథనం సాగించిన ప్రభుత్వం, ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా ఈ సాహసోపేత నిర్ణయానికి మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా ప్రజాప్రతినిధులే ముందుండి త్యాగాలకు సిద్ధపడాలని నిర్ణయించడం గమనార్హం. ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన సమ్మె వ్యవహారం కూడా క్యాబినెట్ భేటీలో ప్రధాన అజెండాగా నిలిచింది. ప్రభుత్వ ఖజానాపై పడుతున్న భారంతో పాటు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపుపై మంత్రులు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవాలనే తర్జనభర్జనలు జరుగుతున్న క్రమంలో, ప్రజాప్రతినిధుల జీతాల్లో సగం వదులుకోవడానికి సిద్ధమని మంత్రులు రేవంత్ రెడ్డికి సూచించారు. తాము చేసే ఈ త్యాగం ద్వారా ఆదా అయ్యే నిధులను నేరుగా రిటైర్డ్ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని వారు స్వచ్ఛందంగా కోరడం ఒక విశేష పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రుల విన్నపానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. తనతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాల్లోనూ 50 శాతం మేర కోత విధించేందుకు తాను సంసిద్ధమేనని ప్రకటించారు. అయితే ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ఇప్పుడే చెప్పలేం. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తున్న ఉన్నతాధికారుల బృందం ఇచ్చే నివేదిక ఆధారంగానే అంతిమ నిర్ణయం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 119 మంది ఎమ్మెల్యేలు, మండలిలో 40 మంది ఎమ్మెల్సీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 119 మంది ఎమ్మెల్యేలలోనే 18 మంది మంత్రులుగా కొనసాగుతున్నారు. ఈ ప్రజాప్రతినిధుల వేతనాలు భారీగానే ఉండటం గమనార్హం. గణాంకాల ప్రకారం చూస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతనం నెలకు సుమారు 4 లక్షల రూపాయలు ఉంటుంది. ఒక్కో మంత్రికి 3 లక్షల రూపాయలు, ఎమ్మెల్యేలు అలాగే ఎమ్మెల్సీలకు తలా 2.50 లక్షల రూపాయల వేతనం అందుతోంది. ఈ లెక్కన సీఎం జీతం 4 లక్షలు, మంత్రుల మొత్తం జీతాలు 54 లక్షలు, ఎమ్మెల్యేల వేతనాలు 3 కోట్లు, ఎమ్మెల్సీల జీతాలు 1 కోటి రూపాయల వరకు ఉన్నాయి. వెరసి నెలకు సుమారు 4.58 కోట్లు ప్రభుత్వం వేతనాల రూపంలో ఖర్చు చేస్తోంది. ఇందులో సగం అంటే 2.27 కోట్ల రూపాయలను ప్రజాప్రతినిధులు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రజా ప్రయోజనాల కోసం ఇంతటి త్యాగానికి సిద్ధపడటం గొప్ప విషయమే అనిపిస్తుంది. ప్రజాప్రతినిధుల త్యాగం భావజాలం పరంగా గొప్పగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి ఇది ఏమాత్రం సరిపోతుందనేది ప్రశ్నార్థకం. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు కొండలా పెరిగిపోయి దాదాపు 10 వేల కోట్ల రూపాయలకు చేరాయి. ఇంతటి భారీ బకాయిలను తీర్చడానికి నెలకు ఆదా అయ్యే 2.27 కోట్ల రూపాయలు ఏ మూలకు సరిపోవు. అయితే నిధుల కంటే కూడా మంత్రులు చూపుతున్న చొరవ, వారి స్పిరిట్ ఇక్కడ ముఖ్యం. ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు పాలకులే ముందుగా తమ ఖర్చులను తగ్గించుకోవాలనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది రేవంత్ సర్కార్ ఎత్తుగడగా అర్థమవుతోంది. నిజానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయానికి మూలాలు హిమాచల్ ప్రదేశ్‌లో కనిపిస్తున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అక్కడ అమలుకు సాధ్యం కాని రీతిలో హామీలను గుప్పించింది. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, మహిళలకు నెలకు 1500 రూపాయల నగదు బదిలీ వంటి హామీలను ప్రజలు నమ్మారు. అధికారం చేపట్టిన తర్వాత సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ భారం రాష్ట్ర బడ్జెట్‌ను కుంగదీసింది. 2026 నాటికి జీతాలు కూడా ఇచ్చుకోలేని స్థితికి హిమాచల్ చేరుకుంటుందని నివేదికలు చెబుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్ బడ్జెట్ సుమారు 58 వేల కోట్ల రూపాయలు ఉంటే, రాష్ట్ర సొంత ఆదాయం కేవలం 20 వేల కోట్లు మాత్రమే. అంటే ఆదాయం వ్యయం మధ్య దాదాపు 38 వేల కోట్ల భారీ అంతరం ఉంది. ఈ ఖాళీని పూరించడానికి సీఎం సుఖు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. తనతో పాటు మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధించారు. అధికారులు కూడా 20 నుండి 30 శాతం వేతనాలను వదులుకోవాలని ఆదేశించారు. అయితే అట్టడుగున ఉండే మూడు, నాలుగో తరగతి ఉద్యోగులను ఈ కోత నుండి మినహాయించి ఊరటనిచ్చారు. ఇప్పుడు తెలంగాణలోనూ దాదాపు అలాంటి దృశ్యమే ఆవిష్కృతం కాబోతోంది. హిమాచల్ ప్రదేశ్ సర్కార్ ఇప్పటికే ఆరు నెలల పాటు జీతాల కోత విధిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడిచే అవకాశం మెండుగా ఉంది. గత ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు 2500 రూపాయలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి అనేక వాగ్దానాలు చేశారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇచ్చిన ఈ హామీలు ఇప్పుడు అమలు చేయాలంటే వేల కోట్ల రూపాయల నిధులు కావాలి. ఖజానా ఖాళీగా ఉండటంతో హామీల అమలు ప్రభుత్వంపై పెనుభారంగా మారింది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై రేవంత్ రెడ్డి మొదటి నుంచీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, వడ్డీలు కట్టడానికే నిధులు సరిపోవడం లేదని ఆయన బాహాటంగానే విమర్శిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఎన్నికల లబ్ధి కోసం అపరిమితమైన హామీలు ఇచ్చింది. బీజేపీ సైతం ఏమాత్రం తగ్గకుండా వాగ్దానాల వర్షం కురిపించింది. పార్టీలన్నీ పోటీపడి ఇచ్చిన ఆచరణ సాధ్యం కాని హామీల వల్ల రాష్ట్రాలు ఆర్థికంగా దివాలా తీసే స్థాయికి చేరుకుంటున్నాయి.

2019 @ 52 రోజులు.. 25 మంది మృతి

మొదటిపేజీ తరువాయి

కార్మికుల వెనకడుగుతో ఒక ముగింపునకు వచ్చింది. నవంబరు 25న కార్మిక సంఘాలు తమ షరతులను పక్కన పెట్టి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించాయి. అయితే ప్రభుత్వం వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవడానికి అంగీకరించకపోవడంతో మరో రెండు రోజుల పాటు ఉత్కంఠ కొనసాగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నవంబరు 28న ప్రగతి భవన్‌లో కార్మికులతో సమావేశమై తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. కార్మికులందరూ తన బిడ్డలేనని యూనియన్ నేతల మాటలు విని దారి తప్పారని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించే బాధ్యతను కార్మికులకే అప్పగిస్తూ వారందరినీ విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రగతి భవన్‌లో కార్మికులకు విందు ఏర్పాటు చేసి వారితో కలిసి భోజనం చేయడం ఒక అరుదైన దృశ్యంగా నిలిచింది. ఒక కఠినమైన పోరాటం చివరకు ఆత్మీయ ఆలింగనంతో ముగియడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సంస్థ భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ సమ్మె కాలంలో జరిగిన ప్రాణనష్టం కార్మిక కుటుంబాల్లో తీరని లోటు మిగిల్చింది. శంకర్ గౌడ్ వంటి వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి చేసిన పోరాటం ప్రభుత్వ వైఖరిని మార్చడంలో కీలక పాత్ర పోషించింది. వరంగల్ జిల్లాలో జరిగిన నిరసనలు, పోలీసులు మోహరింపులు ఆనాటి పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తాయి. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాలని, సంస్థను లాభాల బాటలో నడిపించాలని ప్రభుత్వం కార్మికులకు సూచించింది. సమ్మె విరమణ తర్వాత కార్మికులు తిరిగి తమ విధుల్లో చేరినప్పుడు అనేక చోట్ల భావోద్వేగపూరితమైన సన్నివేశాలు కనిపించాయి. సంస్థను బతికించుకోవాలనే సంకల్పం వారిలో బలంగా నాటుకుపోయింది. ఆర్టీసీ చరిత్రలో 2019 సమ్మె ఒక పాఠం వంటిది. ప్రజా రవాణా వ్యవస్థపై ఆధారపడిన లక్షలాది మంది ప్రయాణికుల ఇబ్బందులను ఈ సమ్మె కళ్ళకు కట్టింది. 52 రోజుల సుదీర్ఘ కాలం బస్సులు డిపోలకే పరిమితం కావడంతో సంస్థకు భారీగా నష్టం వాటిల్లింది. అయితే కార్మికుల ఐక్యత, వారి డిమాండ్ల వెనుక ఉన్న ఆవేదన ఈ పోరాటం ద్వారా లోకానికి తెలిసింది. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించినప్పటికీ చివరకు మానవీయ కోణంలో ఆలోచించి అందరినీ విధుల్లోకి తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం. కానీ పోగొట్టుకున్న ప్రాణాలు మాత్రం తిరిగి రాలేవు. ఆ చేదు జ్ఞాపకాలు కార్మిక లోకాన్ని ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుత తరానికి ఈ పోరాటం ఒక హెచ్చరికలా కనిపిస్తుంది. వ్యవస్థలను బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో కార్మికుల సంక్షేమాన్ని చూడటం కూడా అంతే ప్రధానం. 48 వేల కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకమైన వేళ జరిగిన ఈ పోరాటం అనేక రాజకీయ మార్పులకు సైతం కారణమైంది. రవాణా సంస్థను ప్రభుత్వంలో

విలీనం చేయాలనే డిమాండ్ అప్పట్లో నెరవేరకపోయినా తర్వాతి కాలంలో అనేక చర్చలకు పునాది వేసింది. పాలకులకు, పాలితులకు మధ్య ఉండే సంబంధం గర్వం పంతం మీద కాకుండా సమన్వయంతో సాగాలని ఈ సమ్మె నిరూపించింది. ఆర్టీసీ కార్మికుల త్యాగాలు సంస్థ మనుగడకు స్ఫూర్తినిచ్చాయి. పోరాటాలు హక్కుల కోసం జరిగినా చివరకు ప్రజల ప్రయోజనాలే పరమావధి కావాలి.

GENERAL news

WWW.VISHALABHARATI.COM

విశాల భారతి

బీజేపీలోకి ఆప్ ఎంపీల జైత్రయాత్ర

- 10 మంది ఆప్ రాజ్యసభ ఎంపీల్లో 7 గురు బీజేపీలోకి
- అనర్హత పడకుండా 2/3 వంతు మంది కలిసి నిర్ణయం
- రాఘవ్ చద్దా, హర్భజన్, స్వాతి మలివాల్ వంటి వారు విడారు
- ఆప్ ఆశయాల విస్మరణ, మోదీ నాయకత్వంపై మొగ్గు
- కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్తులే దూరం కావడం షాక్
- రాజ్యసభలో ఆప్ బలం పతనం, పెరగనున్న బీజేపీ బలం

విశాలభారతి, జాతీయం:

దేశ రాజధాని రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ పునాదులు కదిలిపోయేలా మెజారిటీ రాజ్యసభ సభ్యులు కమలం గూటికి చేరడం జాతీయ స్థాయిలో పెను సంచలనం సృష్టించింది. కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తులుగా పేరు గాంచిన నేతలు సైతం పార్టీని వీడటంతో ఒక్కసారిగా సమీకరణాలు మారిపోయాయి. ఆప్ అంతర్గత కలహాలు చిలికి చిలికి గాలివానలా మారి చివరకు పార్టీ చీలికకు దారితీయడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఆప్ అగ్రనేత, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా శుక్రవారం నాటి మీడియా సమావేశంలో ఈ సంచలన నిర్ణయాన్ని బాహ్య ప్రపంచానికి వెల్లడించారు. రాజ్యసభలో ఆప్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మొత్తం 10 మంది సభ్యులలో ఏడుగురు ఏకతాటిపైకి రావడం గమనార్హం. భారత రాజ్యాంగ నిబంధనలను అనుసరిస్తూ 2/3 వంతు మెజారిటీతో బీజేపీలో విలీనం కావాలని తాము గట్టి నిర్ణయం తీసుకున్నట్లు రాఘవ్ చద్దా స్పష్టం చేశారు. సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ వంటి కీలక నేతలు ఆయన వెంటే ఉండి మద్దతు పలకడం పార్టీలో చీలిక తీవ్రతను చాటిచెబుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇదొక చారిత్రాత్మక పరిణామమని వారు అభివర్ణించారు. ఈ వ్యూహాత్మక అడుగుతో ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంటరీ బలం గణనీయంగా పడిపోయింది. ఫిరాయింపుల నిరోధక చట్టం ముప్పును ముందే పసిగట్టిన చద్దా బృందం ఎంతో చాకచక్యంగా వ్యవహరించింది. సభ్యత్వాలు కోల్పోకుండా ఉండేలా రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ వెసులుబాటును వారు పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. ఒక రాజకీయ పక్షంలోని 2/3 వంతు సభ్యులు వేరే పార్టీలో విలీనమైతే వారిపై అనర్హత వేటు వేయడం సాధ్యపడదని చట్టం చెబుతోంది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని విలీన ప్రక్రియను పూర్తి చేశారు. తమ సంతకాలతో కూడిన అధికారిక లేఖను రాజ్యసభ ఛైర్మన్‌కు ఇప్పటికే అందజేసినట్లు చద్దా వివరించారు. విలీనమైన ఈ బృందంలో హేమాహేమీలు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్‌తో పాటు టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్, రాజేందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ వంటి ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నమ్మకం కోల్పోయినందునే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. కేజ్రీవాల్ నాయకత్వంలో పనిచేసిన అత్యంత నమ్మకస్తులైన నేతలు కూడా ఇప్పుడు ప్రత్యర్థి శిబిరంలోకి వెళ్లడం ఆప్ మనుగడపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. గత 15 ఏళ్లుగా రక్తాన్ని, చెమటను ధారపోసి నిర్మించుకున్న పార్టీని వీడటం బాధాకరమని రాఘవ్ చద్దా ఉద్వేగానికి లోనయ్యారు. ఆశయాల సాధన కోసం పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడు తన ప్రాథమిక విలువల నుండి పక్కకు తప్పుకుందని ఆయన విమర్శించారు. సామాన్యుల గొంతుకగా మారాల్సిన పార్టీ నేడు కేవలం వ్యక్తిగత ప్రయోజనాల చుట్టూ తిరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రయోజనాల కంటే స్వార్థ రాజకీయాలే రాజ్యమేలుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. వ్యవస్థలో మార్పు కోరుకునే వారందరికీ ఆప్ ఒకప్పుడు ఆశాకిరణంగా ఉండేదని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని దార్శనికత దేశాభివృద్ధికి దిక్సూచిగా మారిందని చద్దా కొనియాడారు. వికసిత భారత్ నిర్మాణంలో తాము కూడా క్రియాశీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ అనుసరిస్తున్న జాతీయవాదం, సుపరిపాలన తమను ఆకర్షించినట్లు ఆయన వెల్లడించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారత్‌కు మరింత బలాన్ని చేకూర్చడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ మార్పు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, దేశ భవిష్యత్తు కోసం తీసుకున్న నిర్ణయమని ఉద్ఘాటించారు. రాజ్యసభలో 10 మంది ఎంపీలున్న ఆప్‌కు ఈ పరిణామం కోలుకోలేని దెబ్బగా మారింది. ఏడుగురు సభ్యులు ఒకేసారి దూరమవ్వడం వల్ల సభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం నామమాత్రంగా మిగిలిపోయింది. రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను పార్టీ ఇటీవల తొలగించిన నేపథ్యంలోనే ఈ తిరుగుబాటు జరగడం గమనార్హం. పార్టీ లోపల అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నా నాయకత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కేజ్రీవాల్ జైలుకు వెళ్ళిన తర్వాత పార్టీలో స్పష్టమైన నాయకత్వ లోపం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన కొన్ని పరిణామాలు కూడా నేతల మధ్య దూరాన్ని పెంచాయి. ముఖ్యంగా స్వాతి మలివాల్ వంటి మహిళా నేతలు ఎదుర్కొన్న పరిస్థితులు కూడా ఈ అసమ్మతికి ఆజ్యం పోశాయి. సీనియర్లను కాదని కొందరికే ప్రాధాన్యత ఇవ్వడం పట్ల అశోక్ మిట్టల్, విక్రమ్ సాహ్నీ వంటి వారు అసహనంతో ఉన్నారు. క్రమశిక్షణ పేరిట సాగిస్తున్న వేధింపులు భరించలేకే బయటకు వచ్చినట్లు వారు సంకేతాలు ఇచ్చారు. బీజేపీకి ఈ విలీనం అదనపు బలాన్ని చేకూర్చనుంది. ఎగువ సభలో కీలక బిల్లుల ఆమోదం పొందే సమయంలో ఈ ఏడుగురు సభ్యుల మద్దతు కమలదళానికి ఎంతగానో ఉపయోగపడనుంది. విపక్ష కూటమి ఐక్యతను దెబ్బతీయడంలో కూడా ఇది విజయవంతమైన ఎత్తుగడగా పరిగణించవచ్చు. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల నుంచి పార్లమెంట్ వరకు అన్ని చోట్లా ఆప్‌ను బలహీనపరచాలనే బీజేపీ వ్యూహం ఫలించినట్లు కనిపిస్తోంది. పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు కూడా ఉండటంతో ఆ రాష్ట్ర రాజకీయాల్లోనూ ప్రకంపనలు మొదలయ్యాయి. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడిని ఈ ఘటన మరోసారి నిరూపించింది. సామాన్యుల పార్టీగా గుర్తింపు పొందిన ఆప్, ఇప్పుడు తన అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాడాల్సిన స్థితికి చేరుకుంది. క్షేత్రస్థాయి కార్యకర్తలు ఈ పరిణామంతో తీవ్ర నిరాశలో మునిగిపోయారు. పార్టీని మళ్లీ గాడిలో పెట్టడం కేజ్రీవాల్‌కు ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. రాబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఫిరాయింపుల చట్టం పరిధిలో నుంచి తప్పించుకుంటూ చేపట్టిన ఈ విలీనం రాజకీయ చదరంగంలో ఒక మాస్టర్ స్ట్రోక్ అని చెప్పవచ్చు. ఆప్ కోల్పోయిన ఎంపీల సంఖ్య చిన్నదేమీ కాదు, ఇది ఆ పార్టీ పార్లమెంటరీ ఉనికిని దెబ్బతీసింది. మరోవైపు బీజేపీ తన ఆపరేషన్ లోటస్‌ను విజయవంతంగా అమలు చేసి తన బలాన్ని నిరూపించుకుంది. రాబోయే రోజుల్లో ఢిల్లీ రాజకీయాల్లో మరిన్ని సంచలనాలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రాజకీయ కురుక్షేత్రంలో గెలుపెవరిదో కాలమే నిర్ణయించాలి.

రహదారి ఖాళీ... బ్రతుకులు ఖాళీ

- ఆర్థిక రాజధాని నుంచి రాజకీయ రాజధానిగా మారుతున్న అశ్వారావుపేట పరిస్థితి
- గ్రీన్ ఫీల్డ్ షాక్... అశ్వారావుపేట బిజినెస్ లాక్
- గ్రీన్ ఫీల్డ్ వైపు మళ్లిన రవాణా వాహనాలు, కార్లు, ప్రైవేట్ ప్రయాణిక వాహనాలు
- అడపాదడప వచ్చే వాహనాలు... మిగిలింది పల్లె వెలుగు బస్సులేనా?
- రద్దీ రోడ్ల నుంచి నిశ్శబ్దం వైపు...
- అభివృద్ధి కోరుకునే వారికి కంటనీరు తెప్పించే దృశ్యం
- తెలంగాణ గుమ్మంగా ఉన్న అశ్వారావుపేట పరిస్థితి ఏంటి?
- ఎన్నో అటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డ పట్టణానికి భవిష్యత్తు ఏమిటి?

అశ్వారావుపేట, విశాలభారతి :

అశ్వారావుపేట ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ హైవే మార్గం మార్పు స్థానిక వ్యాపారాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఒకప్పుడు భారీ వాహనాల రాకపోకలతో కిక్కిరిసిపోయే ఈ ప్రాంతం, ఇప్పుడు నిశ్శబ్దంగా మారిపోయింది. రోజంతా ట్రాఫిక్‌తో కళకళలాడే రహదారులు, ఇప్పుడు ఖాళీగా కనిపిస్తూ వ్యాపారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యేకంగా హోటళ్లు, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లు, ఆటోమొబైల్ షాపులు, మెకానిక్ వర్క్‌షాప్‌లు మాత్రమే కాకుండా కొబ్బరి బొండాల షాపులు, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు తీసే షాపులు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభం తర్వాత భారీ వాహనాలు ప్రధాన రహదారిని వదిలి కొత్త మార్గాన్ని ఎంచుకోవడంతో, ఇక్కడి వ్యాపారాలపై ఆధారపడిన కష్టమర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అదేవిధంగా, ఒకప్పుడు అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి విడిపోయి ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన కుక్కునూర్, వేలేరుపాడు మండలాలకు వ్యాపార కేంద్రంగా వెలుగొందిన అశ్వారావుపేట—2014కు ముందు ఒక "వ్యాపార రాజధాని"గా పేరుగాంచింది. ఆ ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు అన్ని అవసరాల కోసం అశ్వారావుపేటనే ఆశ్రయించేవారు. బట్టల వ్యాపారం, సంతలు, సినిమాలు, ఆటో ప్రయాణాలు, చిరు వ్యాపారాలు, బంగారం వ్యాపారం, తాకట్టు దుకాణాలు, ఆసుపత్రులు—అన్నింటికీ ఇదే ప్రధాన కేంద్రంగా ఉండేది. రాష్ట్ర విభజనతో రెండు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో కలవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు ఆర్థికంగా ఉత్సాహంగా ఉన్న ఈ పట్టణం, ఇప్పుడు క్రమంగా తన పాత వైభవాన్ని కోల్పోతూ దిగజారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆర్థిక రాజధాని"గా ఉన్న అశ్వారావుపేట, ఇప్పుడు కేవలం "రాజకీయ రాజధాని"గా మిగిలిపోయిందనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బస్సులు మరియు కొద్దిపాటి చిన్న వాహనాలు తప్ప, ఒకప్పుడు తరలివచ్చే భారీ ట్రక్కులు, లారీలు కనిపించడం దాదాపు ఆగిపోయింది. దీంతో రోడ్డుపక్కన ఆధారపడి నడిచే వ్యాపారాలన్నీ క్షీణత దిశగా వెళ్తున్నాయి. ఇప్పటివరకు ట్రక్ డ్రైవర్లు, ప్రయాణికులు, వాణిజ్య వాహనాలపై ఆధారపడి జీవనం సాగించిన చిన్న వ్యాపారులు ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ ఖర్చులు తీర్చుకోవడమే కష్టంగా మారింది. టీ స్టాళ్లు మరియు ముఖ్యంగా కొబ్బరి బొండాల దుకాణాలు పూర్తిగా ప్రయాణికులపై ఆధారపడి ఉండటంతో అమ్మకాలు దాదాపు నిలిచిపోయాయి. అలాగే ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు తీసే కంప్యూటర్ షాపులు, లోడింగ్ రసీదులు ఇచ్చే కాంటా సెంటర్లు కూడా వాహనాల రాకపోకలు తగ్గిపోవడంతో పని లేకుండా పోయింది. నరంవరిగూడెం, అచ్చుతాపురం, మందలపల్లి రహదారి వెంబడి లారీలు, ఆటోలు, కార్లు ఆగి పూల మొక్కలు, మామిడి, జీడిపండ్లు, కొబ్బరి మొక్కలు కొనుగోలు చేసేవి. ఆ వ్యాపారం కూడా ఇప్పుడు ఇబ్బందుల్లో పడింది.

కవిత కొత్త పార్టీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక మలుపునకు రంగం సిద్ధమైంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించబోతున్నారు. నేడు మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభలో ఆమె తన నూతన రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సభా ప్రాంగణం లక్షలాది మంది కార్యకర్తలతో కిక్కిరిసిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆమె అనుచరులు, అభిమానులు మునీరాబాద్ వైపు తరలివస్తున్నారు. సభా ప్రాంగణం వద్ద వెలసిన స్వాగత తోరణాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. 'తెలంగాణ ప్రజా వికాస్ సమితి' అనే పేరుతో వెలసిన భారీ బోర్డులు రాజకీయ వర్గాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకు 'తెలంగాణ ప్రజా జాగృతి' అనే పేరు ప్రచారంలో ఉన్నప్పటికీ.. అనూహ్యంగా ఈ కొత్త పేరు తెరపైకి రావడం విశేషం. ఈ పేరు తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండటం గమనార్హం. గతంలో టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ తరహాలోనే ఈ పేరు వినిపిస్తుండటంతో రాజకీయ విశ్లేషకులు దీనిపై లోతుగా చర్చిస్తున్నారు. ఈ పేరు ద్వారా ఆమె ప్రజల్లోకి బలంగా వెళ్లాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రాంగణంలోని తోరణాలపై తెలంగాణ సంస్కృతికి చిహ్నాలైన గోల్కొండ కోట, కాకతీయ తోరణం చిత్రాలను పొందుపరిచారు. రాష్ట్ర వారసత్వాన్ని గౌరవిస్తూనే.. ప్రజల వికాసమే లక్ష్యంగా ఈ పార్టీ పనిచేయబోతోందని ఈ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా పార్టీ జెండాను, అజెండాను రూపొందించినట్లు సమాచారం. ఈ పార్టీ ప్రకటనతో రాష్ట్రంలోని రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా యువతను, మహిళలను ఆకర్షించేలా కవిత తన ప్రసంగాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. సుమారు 10,000 మంది వాలంటీర్లు ఈ సభ నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. కవిత కొత్త పార్టీకి గుర్తుగా 'ధర్మగంట'ను ఎంపిక చేయడం మరో ఆసక్తికర అంశం. అన్యాయం జరిగినప్పుడు మోగించే సంప్రదాయానికి ప్రతీకగా ఈ గుర్తును ఆమె ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే ఈ గుర్తును ప్రతిపాదించినట్లు సమాచారం అందుతోంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే శక్తిగా ఈ పార్టీని తీర్చిదిద్దాలని కవిత సంకల్పించారు. ధర్మగంట ద్వారా సామాన్యుల గొంతుకను వినిపించడమే తన లక్ష్యమని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఈ గుర్తు ప్రజల్లోకి సులభంగా వెళ్తుందనే నమ్మకంతో పార్టీ శ్రేణులు ఉన్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ వారసత్వం నుంచి బయటకు వచ్చి సొంతంగా పార్టీ పెడుతుండటం గమనార్హం. 'తెలంగాణ ప్రజావికాస్ సమితి' అనే పేరు కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌కు దగ్గరగా ఉండటం చర్చకు దారితీస్తోంది. ఇది బిగ్ షాక్ అని కొందరు వాదిస్తుండగా.. మరికొందరు దీనిని వ్యూహాత్మక అడుగుగా అభివర్ణిస్తున్నారు. కవిత తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ పార్టీ కేడర్‌లో కొంత గందరగోళాన్ని సృష్టిస్తోంది. సుమారు 15 జిల్లాల నుంచి కీలక నేతలు ఈ సభకు హాజరవుతారని భావిస్తున్నారు. ఆమె సొంతంగా ఎదగాలనే పట్టుదలతో ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ కొత్త పార్టీ ప్రకటనతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ సైతం అప్రమత్తమయ్యాయి. తెలంగాణలో మూడవ ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కవిత గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భారీ బహిరంగ సభకు దాదాపు 2,00,000 మంది హాజరవుతారని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందుకోసం 500 బస్సులు, 1000కి పైగా వాహనాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. మునీరాబాద్ ప్రాంతమంతా హోర్డింగ్‌లతో నిండిపోయి పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ సభ ద్వారా తన బలాన్ని నిరూపించుకోవాలని కవిత కృతనిశ్చయంతో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ సంఘాల మద్దతును కూడగట్టే పనిలో ఆమె నిమగ్నమయ్యారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. తెలంగాణ ప్రజావికాస్ సమితి పేరులో పాత టీఆర్ఎస్ ఛాయలు కనిపిస్తున్నాయి. ఇది పాత క్యాడర్‌ను ఆకర్షించేందుకు వేసిన ఎత్తుగడగా భావించవచ్చు. పార్టీ జెండా రంగులు, గుర్తు ఎంపికలోనూ ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రజల వికాసమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆమె ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆమె వేదికపై నుంచి పార్టీ విధానాలను ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చే సందేశంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. పార్టీ అజెండాలో రైతు సమస్యలు, నిరుద్యోగం ప్రధాన అంశాలుగా ఉండే అవకాశం ఉంది. సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ముగ్గురు డీసీపీలు, 10 మంది ఏసీపీల పర్యవేక్షణలో సుమారు 1,200 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ మళ్లింపుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఎత్తున భోజన వసతులు కల్పించారు. బహిరంగ సభ విజయవంతం చేయడం ద్వారా తన సత్తా చాటాలని కవిత భావిస్తున్నారు. ఈ సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ విధివిధానాల కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని కూడా నియమించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు కవిత తన పార్టీలో పెద్దపీట వేయబోతున్నారని టాక్ నడుస్తోంది. 33 శాతం రిజర్వేషన్లు పార్టీ పదవుల్లో కల్పించాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచారం. యువతకు కూడా పెద్ద ఎత్తున అవకాశాలు ఇవ్వాలని ఆమె యోచిస్తున్నారు. ఈ పార్టీ ద్వారా కొత్త రకమైన రాజకీయ సంస్కృతిని తీసుకురావాలని కవిత ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ఆమె ముందుకు సాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా త్వరలోనే ప్రారంభించనున్నారు. ప్రతి గ్రామంలోనూ 'తెలంగాణ ప్రజావికాస్ సమితి' జెండా ఎగిరేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. కల్వకుంట్ల కవిత గతంలో నిర్వహించిన 'తెలంగాణ జాగృతి' కార్యక్రమాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. ఇప్పుడు అదే స్ఫూర్తిని రాజకీయ వేదికపై ప్రదర్శించాలని ఆమె భావిస్తున్నారు. బతుకమ్మ సంబరాల ద్వారా తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేసిన ఆమె.. ఇప్పుడు రాజకీయాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని చూస్తున్నారు. తన తండ్రి కేసీఆర్ నేర్పిన రాజకీయ మెలకువలను ప్రదర్శిస్తూనే.. తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకోవడంలో ఆమె సఫలమయ్యారు. ఈ కొత్త పార్టీ ద్వారా ఆమె సాధించబోయే విజయాలు భవిష్యత్తు తెలంగాణ రాజకీయాలను శాసించనున్నాయి. మొత్తానికి ఏప్రిల్ 25వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక దినంగా మిగిలిపోనుంది. మునీరాబాద్ బహిరంగ సభలో కవిత చేసే ప్రసంగం రాష్ట్ర రాజకీయ దిశను మారుస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'తెలంగాణ ప్రజావికాస్ సమితి' పేరుతో ఆమె వేయబోయే తొలి అడుగు ఏ మేరకు సక్సెస్ అవుతుందో చూడాలి. విపక్షాలు సైతం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ప్రజా సమస్యలపై పోరాటమే ఊపిరిగా సాగే ఈ పార్టీ.. ప్రజల మన్ననలు పొందుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా కవిత కొత్త పార్టీ ప్రకటనతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ముందే వచ్చినట్లయింది.

మానని గాయం..!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రమాదం జరిగిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి 10 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే సిగాచి యాజమాన్యం ఇప్పటి వరకు ఒక్కో మృతుని కుటుంబానికి కేవలం 42 లక్షల రూపాయలు మాత్రమే అందజేసి చేతులు దులుపుకుంది. మిగిలిన మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా వస్తుందని చెబుతూ బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తోంది. కంపెనీ తరపున పూర్తి స్థాయి పరిహారం అందకపోవడంతో మృతుల బంధువులు దిక్కుతోచని స్థితిలో అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యాజమాన్యం వైఖరిపై బాధితుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గల్లంతైన ఎనిమిది మంది కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వెంకటేష్, అఖిలేష్, చిల్వేర్ రవి, రాహుల్ కుమార్, జస్టిన్ పాల్, శివ్ జీ కుమార్, ఇర్ఫాన్ అన్సారీ, విజయ్ కుమార్ అనే ఎనిమిది మంది పేలుడు తీవ్రతకు కాలి బూడిదయ్యారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటన జరిగిన ఆరు నెలల తర్వాత ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి వీరికి మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేసినా వారి కుటుంబాలకు రావాల్సిన పూర్తి స్థాయి ఆర్థిక సాయం అందలేదు. తమ వారు చనిపోయారన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేక, కనీసం చివరి చూపు కూడా దక్కలేదన్న వేదనతో ఆ కుటుంబ సభ్యులు నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. కేంద్ర హోంశాఖ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలు వారికి ఏమాత్రం ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. క్షతగాత్రుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో తమకు అయ్యే వైద్య ఖర్చులన్నీ భరిస్తామని, పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటామని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు మాట తప్పుతోంది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత బాధితులు మందుల కోసం, నెలవారీ పరీక్షల కోసం వెళ్తుంటే తమకు సంబంధం లేదని యాజమాన్యం నిర్మొహమాటంగా చెబుతోంది. పేలుడు దాటికి శరీరాలు కాలిపోయి, అవయవాలు పని చేయకపోవడంతో కార్మికులు బతుకీడుస్తున్నారు. కంపెనీ హామీని నమ్మి వైద్యం చేయించుకున్న వారు ఇప్పుడు ఆర్థికంగా చితికిపోతున్నారు. మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేక పలువురు చికిత్సను మధ్యలోనే నిలిపివేశారు. బీహార్‌కు చెందిన రాజేష్ చౌదరి అనే కార్మికుడి గాథ బాధ్యులైన వారిని కలచివేస్తోంది. ప్రమాద సమయంలో పై అంతస్తు నుంచి కింద పడటంతో అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన రాజేష్ ఇద్దరి పెళ్లిళ్లు చేశాడు. మరో ముగ్గురు కుమార్తెలకు వివాహం చేయాల్సిన బాధ్యత అతనిపై ఉంది. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని స్థితిలో మంచానికే పరిమితమైన తనను చూసి రాజేష్ కన్నీరుమున్నీరవుతున్నాడు. తన బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన అతనిని నిరంతరం వేధిస్తోంది. సిగాచి యాజమాన్యం వైద్య ఖర్చులు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నాడు. ఇలాంటి రాజేష్‌లు మరికొందరు ఈ పాశమైలారం పారిశ్రామిక వాడలో మౌనంగా రోదిస్తున్నారు. పరిశ్రమలో కెమిస్ట్ గా పనిచేసిన సుష్మ అనే యువతి జీవితం పేలుడు కారణంగా తలకిందులైంది. చేతులకు గోరింటాకు పెట్టుకోవాల్సిన వయసులో ఆమె చేతులు నల్లగా కమిలిపోయి వికారంగా మారాయి. ఎడమ చేతి వేళ్లు దగ్గరికి రాకపోవడంతో ఆమె ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి వస్తోంది. నెలకు సుమారు 6 వేల రూపాయల వరకు ఖర్చవుతుండగా యాజమాన్యం కేవలం 2 వేల రూపాయలు మాత్రమే ఇస్తామని చెప్పడం ఆమెను మానసికంగా కృంగదీస్తోంది. పెళ్లి సంబంధాలు వస్తున్నా చేతులకు ఉన్న గాయాలను చూసి ఎవరూ ముందుకు రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. వైద్యానికి సరిపడా నిధులు అందక ఆమె ఇప్పుడు హాస్పిటల్ కు వెళ్లడం కూడా మానేసింది. మైక్రో బయాలజిస్ట్ గా పనిచేస్తున్న దివ్య కథ కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. ప్రమాదంలో ఆమె వెన్నెముకకు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. నెలకు కనీసం 20 వేల రూపాయల వైద్య ఖర్చులు అవుతున్నా గత ఐదు నెలల నుంచి యాజమాన్యం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. క్షతగాత్రులకు ప్రభుత్వం ప్రకటించిన 10 లక్షల రూపాయల పరిహారంలో కూడా కోత పెట్టి కేవలం 9.5 లక్షల రూపాయలే ఇచ్చారని ఆమె ఆరోపిస్తోంది. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆమె వాపోతోంది. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ ఉద్యోగులు ఇలాంటి ప్రమాదాల వల్ల జీవితకాలం అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. పరిహారం చెల్లింపులో జరుగుతున్న అన్యాయంపై ఎట్టకేలకు హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం యాజమాన్యం తీరును తప్పుబట్టింది. కోర్టుకు పొంతన లేని సమాధానాలు చెబుతున్న కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్కో కుటుంబానికి 42 లక్షల రూపాయలు ఇచ్చామని, మిగిలిన మొత్తం ఇన్సూరెన్స్ ద్వారా సర్దుబాటు చేస్తామని చెప్పడాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. పరిహారం చెల్లింపునకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రావాల్సిన కోటి రూపాయల పరిహారం విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని యాజమాన్యాన్ని నిలదీసింది. న్యాయస్థానం జోక్యంతోనైనా తమకు న్యాయం జరుగుతుందని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రమాద బాధితులకు సంఘీభావంగా ప్రజా సంఘాలు, సీఐటీయూ కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నాయి. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మృతుల కుటుంబాలు, క్షతగాత్రులు కలిసి నిర్వహించిన ధర్నా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. తమకు రావాల్సిన పూర్తి పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని, గల్లంతైన ఎనిమిది మంది కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పటాన్ చెరు పోలీసులు కంపెనీ సీఈఓ అమిత్ రాజ్ సిన్హాని అరెస్ట్ చేసినప్పుడు బాధితులకు కాస్త భరోసా లభించినా, ఆ తర్వాత పరిహారం పంపిణీలో మాత్రం పురోగతి లేకపోవడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అన్యాయం జరిగిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరిస్తున్నాయి. సిగాచి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారు చాలా వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన నిరుపేద కార్మికులు. తమ సొంత ప్రాంతాలకు దూరంగా ఉపాధి కోసం వచ్చి ఇక్కడ ప్రాణాలు వదిలారు. వారికి స్థానిక రాజకీయాలు, పరిహారం పొందే ప్రక్రియపై అవగాహన లేకపోవడాన్ని యాజమాన్యం ఆసరాగా చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. భాషా సమస్యలు, భౌగోళిక దూరం కారణంగా బాధితులు పదే పదే అధికారులను సంప్రదించలేకపోతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నేరుగా బాధిత కుటుంబాల ఖాతాల్లోకి నగదు జమ అయ్యేలా చూడాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. రాజకీయ నాయకులు కేవలం సానుభూతి మాటలు చెప్పడం ఆపి ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. మొత్తంగా సిగాచి ఘటన ఒక తీరని వేదనను మిగిల్చింది. పారిశ్రామిక భద్రతా ప్రమాణాలను విస్మరించినందుకు 46 మంది బలికావడం వ్యవస్థ లోపాలను ఎత్తిచూపుతోంది. నష్టపరిహారం విషయంలో యాజమాన్యం ప్రదర్శిస్తున్న వైఖరి మానవత్వానికే మచ్చలా మారింది. మృతుల కుటుంబాల్లోని అనాథలు, వితంతువుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలి. కోర్టు ఆదేశాల మేరకు పూర్తి స్థాయి పరిహారం అందేలా కలెక్టర్ పర్యవేక్షణలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బాధితుల కన్నీళ్లకు పరిష్కారం లభించినప్పుడే వారికి అసలైన న్యాయం జరిగినట్లు భావించవచ్చు.

గులాబీ అగ్రనేతలకు విముక్తి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో అత్యంత కీలకమైన ఘట్టంగా నిలిచిన మిలియన్ మార్చ్ ఉదంతంపై నమోదైన కేసుల నుంచి భారత్ రాష్ట్ర సమితి అగ్రనేతలకు భారీ ఊరట లభించింది. సుదీర్ఘ కాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ అభియోగాలను రద్దు చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో పాటు కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఉన్న అన్ని రకాల సెక్షన్లను కొట్టివేస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. 2011 మార్చి మాసంలో ట్యాంక్‌బండ్ వేదికగా సాగిన ఆందోళనల్లో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, శాంతిభద్రతల విఘాతం వంటి అంశాలపై స్థానిక పోలీసులు అప్పట్లో 8 వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన ఈ కేసుల విచారణ గడిచిన 15 ఏళ్లుగా నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుతో పాటు హైకోర్టులోనూ కొనసాగుతూ వచ్చింది. ఉద్యమ సమయంలో వేలాది మంది ప్రజలు చలో అసెంబ్లీ, సాగర హారం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్న తరుణంలో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలకు నాయకులే బాధ్యులని పోలీసులు అభియోగాలు మోపారు. ఐపీసీ సెక్షన్లు 147, 148, 149, 188 వంటి కఠిన నిబంధనల కింద కేసులు నమోదు కావడం వల్ల వీరు ప్రతి ఎన్నికల సమయంలోనూ తమ అఫిడవిట్లలో ఈ వివరాలను పొందుపరచాల్సి వచ్చేది. రాజకీయంగా ఇబ్బందులు సృష్టిస్తున్న ఈ న్యాయపరమైన చిక్కులను తొలగించుకోవాలని పిటిషనర్లు గతంలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టులో శుక్రవారం జరిగిన తుది విచారణలో పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలను బలంగా వినిపించారు. ఉద్యమకారులు స్వచ్ఛందంగా పాల్గొన్న ఒక భారీ బహిరంగ కార్యక్రమంలో నాయకులు హింసను ప్రోత్సహించారనడానికి ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని కోర్టుకు వివరించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాటి పాలకులు తమపై అక్రమంగా కేసులు బనాయించారని పేర్కొన్నారు. పోలీసు నివేదికల్లోని లొసుగులను ఎత్తి చూపుతూ, సంఘటనా స్థలంలో నేరుగా వీరి ప్రమేయం ఉందని నిరూపించే వీడియో సాక్ష్యాలు గానీ, ఇతర డాక్యుమెంట్లు గానీ దర్యాప్తు సంస్థలు సమర్పించలేదని వాదించారు. ప్రభుత్వ ప్లీడర్ వాదనలను కూడా విన్న ధర్మాసనం ప్రాథమిక విచారణలో పోలీసులు అనుసరించిన తీరును తప్పుబట్టింది. ఒక ప్రజా ఆందోళనలో వేలాది మంది గుమిగూడినప్పుడు జరిగే పరిణామాలకు వేదికపై ఉన్న నాయకులను బాధ్యులను చేయడం చట్టరీత్యా చెల్లదని అభిప్రాయపడింది. సాక్ష్యాధారాల లేమితో పాటు ఎఫ్ఐఆర్‌లలో పేర్కొన్న అంశాలకు, వాస్తవ సంఘటనలకు మధ్య పొంతన లేకపోవడాన్ని న్యాయమూర్తి గుర్తించారు. నిందితులపై మోపిన సెక్షన్లు ఏవీ కూడా న్యాయపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేవని నిర్ధారిస్తూ కేసులను పూర్తిగా కొట్టివేయాలని ఆదేశించారు. ఈ తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక్కసారిగా ఉత్సాహం నెలకొంది. పార్టీ కార్యాలయాల వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తూ తమ నాయకులకు న్యాయం జరిగిందని నినాదాలు చేశారు. గడిచిన దశాబ్ద కాలంలో అనేక సందర్భాల్లో ఈ కేసులు నాయకుల విదేశీ ప్రయాణాలకు, పాస్‌పోర్టు రెన్యూవల్‌కు ఆటంకంగా మారాయి. ఇప్పుడు ఆ అడ్డంకులు తొలగిపోవడం వల్ల పార్టీ కార్యక్రమాల్లో వీరు మరింత క్రియాశీలకంగా పాల్గొనే అవకాశం లభించింది. న్యాయమే గెలిచిందని, ఉద్యమకారుల గళాన్ని అణిచివేయలేరని పార్టీ ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారు. గణాంకాలను పరిశీలిస్తే మిలియన్ మార్చ్ ఉదంతంలో దాదాపు 100 మందికి పైగా చిన్న, పెద్ద నాయకులపై వివిధ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల కూల్చివేతకు సంబంధించి ఒక్క రోజే 5 లక్షల మందికి పైగా జనం తరలివచ్చారని అంచనా. ఆ రద్దీలో పోలీసు బలగాలు కేవలం 3000 మంది మాత్రమే ఉండటం వల్ల పరిస్థితి అదుపు తప్పిందని పాత రికార్డులు చెబుతున్నాయి. సుమారు 1.25 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి నష్టం జరిగిందని నాటి రెవెన్యూ శాఖ నివేదిక సమర్పించింది. ఆ నష్టానికి ఈ ముగ్గురు నేతలే కారణమని పోలీసులు వాదించినా న్యాయస్థానం ఆ వాదనను తోసిపుచ్చింది. తెలంగాణ సమాజం ఈ తీర్పును ఒక చారిత్రక విజయంగా భావిస్తోంది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన పోరాటంలో అగ్రనేతలు పడ్డ శ్రమకు, ఎదుర్కొన్న అవమానాలకు ఇప్పుడు న్యాయస్థానం ద్వారా విముక్తి లభించిందని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. రాజకీయాల్లో క్రిమినల్ కేసులు ఒక సాధారణ అంశంగా మారిన ప్రస్తుత తరుణంలో, ఆధారాలు లేకుండా మోపిన నిందల నుంచి బయటపడటం నైతిక విజయంగా పరిగణించవచ్చు. ఉద్యమ ప్రస్థానంలో ఇలాంటి అనేక ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయని నాయకత్వానికి ఈ ఫలితం ఊరటనిచ్చింది. న్యాయ నిపుణుల విశ్లేషణ ప్రకారం ఈ తీర్పు భవిష్యత్తులో ఇతర ఉద్యమ కేసులకు కూడా ఒక మార్గదర్శకంగా నిలవనుంది. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే నిరసనలపై అక్రమ కేసులు బనాయించే ధోరణికి ఇది అడ్డుకట్ట వేస్తుందని వారు చెబుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసు వ్యవస్థను వాడుకోవడం వల్ల సమయం వృథా అవ్వడమే కాకుండా న్యాయవ్యవస్థపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లపై ఉన్న ఈ కేసులు వీగిపోవడం వల్ల రాబోయే రోజుల్లో మిగిలిన నాయకులపై ఉన్న చిన్నపాటి అభియోగాలు కూడా ఒకటొకటిగా తొలగిపోయే ఆస్కారం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం ఈ కేసులపై గడిచిన పదేళ్లలో సుమారు 45 సార్లు విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది. వందలాది గంటల న్యాయస్థాన సమయం, భారీ ఎత్తున ప్రభుత్వ నిధులు ఈ విచారణల కోసం ఖర్చయ్యాయి. అయినా సరే ఫలితం మాత్రం శూన్యంగా మిగిలిపోయింది. దర్యాప్తు అధికారులు పటిష్టమైన సాక్ష్యాలను సేకరించడంలో విఫలమవ్వడమే ఇందుకు ప్రధాన కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించే తీరువల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సందర్భంగా స్పందిస్తూ సత్యమే ఎప్పుడూ జయిస్తుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం తాము చేసిన పోరాటాన్ని నేరంగా పరిగణించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని, ఇలాంటి అక్రమ కేసులకు తాము బెదిరేది లేదని స్పష్టం చేశారు. హరీశ్‌రావు సైతం గతంలో అనేక సార్లు ఈ కేసుల నిమిత్తం కోర్టు మెట్లు ఎక్కడం వల్ల తమ విలువైన సమయం వృథా అయ్యిందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై సాగిన ప్రతి పోరాటం పవిత్రమైనదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ తీర్పు తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై స్పష్టమైన ప్రభావాన్ని చూపనుంది. ప్రతిపక్షంలో ఉండి పోరాడుతున్న తరుణంలో ఈ న్యాయపరమైన విజయం పార్టీ కార్యకర్తల్లో కొత్త ఆశలను నింపింది. ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, రాబోయే ఎన్నికల్లో ఈ అంశాన్ని ఒక సానుకూల అస్త్రంగా వాడుకోవాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. న్యాయస్థానం ఇచ్చిన ఈ క్లీన్‌చిట్‌తో నాయకులపై ఉన్న మచ్చ తొలగిపోవడమే కాకుండా, వారి రాజకీయ ప్రతిష్ట మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మొత్తం మీద మిలియన్ మార్చ్ కేసుల మూసివేతతో ఒక సుదీర్ఘ రాజకీయ అధ్యాయానికి తెరపడింది.

వాసవి జయంతి రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై హర్షం

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఆలేరు, విశాలభారతి: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొద్దుటూరు రమేష్ గుప్తా మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన అహింసామూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందియమన్నారు. ఆర్యవైశ్య సమాజంలో ఉన్న నిరుపేదలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ. ఈ కార్యక్రమంలో దిడిగం అంజయ్య, మిరియాల ఉమామహేశ్వర్, వంగపల్లి నరేందర్, దిడిగం సంతోష్, కస్తూరి అంజయ్య, నంగునూరు కృష్ణమూర్తి, కాశెట్టి శ్రవణ్ కుమార్, దిడిగం వీరయ్య, కస్తూరి వెంకటేష్, నాగబండి శాంత, రాజయ్య, బలరాం తదితర ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జనగణన శిక్షణలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచనలు

యాదాద్రి భువనగిరి, విశాలభారతి: జనగణన రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం భువనగిరి మున్సిపాలిటీలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనగణనలో చేయవలసిన పనులను ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారని తెలిపారు. శిక్షణను శ్రద్ధగా విని పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని, సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సమగ్రంగా, ఖచ్చితంగా డేటా సేకరణ చేయాలని, అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి జనగణనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభంలో చేనేత రంగం

చౌటుప్పల్, విశాలభారతి: ఉమ్మడి నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో చేనేత హక్కుల సాధన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ..చేనేత రంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను వివరించారు.పద్మశాలి సమాజం అభివృద్ధి కోసం రాజకీయ చైతన్యం అత్యవసరమని పిలుపునిచ్చారు.జనాభా ఉంది కానీ, ప్రాతినిధ్యం లేదని,అందుకే బడ్జెట్ లేదని తెలిపారు.పద్మశాలి సమాజం రాజకీయంగా వెనకబడటం వల్లే చేనేత కార్మికులకు అని,సమస్యలను ప్రభుత్వ దృష్టికి సరైన రీతిలో చేరడం లేదని అభిప్రాయపడ్డారు. చేనేత రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.ముడి సరుకుల ధరలు పెరగడం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యం పెరగడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.ఇకపై మౌనం కాదు,రాజకీయంగా చైతన్యంతో ముందుకు రావాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. చేనేతను కాపాడుదాం,మన హక్కులను సాధించుకుందాం. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానాలు తీసుకురావాలని, పద్మశాలి సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని డిమాండ్ చేశారు.ఈ ఉద్యమం కేవలం ఒక వృత్తి కోసం కాదు...ఇది ఒక సమాజ గౌరవం, ఆత్మగౌరవం కోసం సాగుతున్న పోరాటం అని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్రి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలు మరియు చౌటుప్పల్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుతో ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక: విధానాల్లో మార్పు తీసుకురావాలి: బొట్ల యాదయ్య

మోటకొండూర్, విశాలభారతి: మోటకొండూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనా విధానాల్లో మార్పు తీసుకురావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య మాట్లాడుతూ. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలుపుతూ. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సమానంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి వచ్చిన నీటిని తామే అందిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం సరికాదన్నారు. అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామసభలో అభివృద్ధి ప్రాణుల వివరించిన సర్పంచ్

విశాలభారతి: గూడూరు మేజర్ గ్రామపంచాయతీ గ్రామ సభలో సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ మాట్లాడుతూ గూడూరు గ్రామ ప్రజలందరికీ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మా పాలక మండలి కొలువుదీరి నాలుగు నెలల కాలంలో మేము పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాము.జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నుంచి బొడ్రాయి వరకు సిసి రోడ్డు.అరబింద స్కూల్ నుంచి పోలీస్ స్టేషన్ ముందు నుంచి చంద్రు గూడెం పోయే సీసీ రోడ్డు.అంగడి సెంటర్లో సిసి రోడ్డు. నెక్కొండ రోడ్డు రసమల్ల యాకయ్య వైన్స్ పక్క నుంచి గోపగాని శ్రీను ఇంటి వరకు సిసి రోడ్డు.ఎంపీడీవో ఆఫీస్ ముందు నుంచి పడాల నాగరాజు ఇంటి వరకు సిసి రోడ్డు. నెక్కొండ రోడ్డు నుండి ఎడ్ల సంపత్ రెడ్డి ఇంటి వరకు సిసి రోడ్డు. కన్యక పరమేశ్వర ఫంక్షన్ హాల్ నుండి జెడ్పీఎస్ఎస్ బాలికల స్కూల్ వరకు సిసి రోడ్డు. ఎదునూరి వెంకన్న ఇంటి నుండి పడాల నాగరాజు ఇంటి వరకు సిసి రోడ్. జోగనురి శ్రీను ఇంటి నుండి గడిల యాదగిరి ఇంటి వరకు సీసీ రోడ్డు.మరియు ప్రతిరోజు ఉదయం సాయంకాలం వాటర్ ఇవ్వడం జరుగుతుంది. అలాగే చంద్రు గూడెంలోని వడ్డెర గూడెం నుంచి స్మశాన వాటిక మరియు కబరస్థాన్ వరకు కరెంటు లైన్ లైటింగ్ ఇవ్వడం జరిగింది పారిశుద్ధ్య పనులు నిరంతరం జరుగుతూనే ఉంటాయి: ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ చంటి స్వామి గ్రామపంచాయతీ కార్యదర్శి మధు నాయుడు. వార్డు మెంబర్లు మొత్తం వెంకన్న. చిరబోయిన కుమార్. శిరీష. వాంకుడోత్ భద్రమ్మ. గుగులోతు వినోద.గ్రామస్తులు ఏఎన్ఎంలు ఆశా వర్కర్స్ గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత

మహబూబాబాద్, విశాలభారతి: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ శారు కవిత డిమాండ్ చేశారు. మహబూబాబాద్ డిపో కార్మికులకు మద్దతుగా ఆమె మాట్లాడుతూ, కార్మికులు చేస్తున్న సమ్మెను నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాబినెట్ సమావేశాల్లో సమస్యలపై చర్చించకుండా కాలక్షేపం చేయడం కాకుండా, కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయని అన్నారు. నర్సంపేటలో నిరుపేద కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతి వంటి ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే మరెంతమంది బలి అవుతారో అన్న ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని, కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

జిల్లా కలెక్టర్/జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్

మహబూబాబాద్, విశాలభారతి: జిల్లాలో 20262028 సంవత్సరానికి సంబందిచిన మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందించాలని, ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డీపీఆర్ఓ పి. రాజేంద్ర ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సి.హెచ్ శ్రీనివాస్, ఈరగాని బిక్షం, వేముల అయోధ్య రామయ్య, నవాబ్, , షేక్ అక్రం, ఎం.మోహన్ రెడ్డి, గాడిపెల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన అవసరం

మహబూబాబాద్, విశాలభారతి: ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న నిర్వహించే ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రజలు మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 సంవత్సరానికి గాను ప్రపంచ ఆరోగ్య సంస్థ "మలేరియా అంతానికి ప్రేరణ: ఇప్పుడు మనవల్ల అవుతుంది, ఇప్పుడు మనం తప్పక చేయాలి" అనే నినాదాన్ని ప్రకటించిందని తెలిపారు. మలేరియా ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా ఉందని, ముఖ్యంగా వర్షాకాలంలో దోమల పెరుగుదల కారణంగా వ్యాధి వ్యాప్తి అధికమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే సంక్రమణ వ్యాధి అని పేర్కొన్న ఆయన, జిల్లాలో కేసులను తగ్గించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే కేసులు తగ్గినా, ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. ప్రజల్లో అవగాహన పెంపు, దోమల నియంత్రణ చర్యల బలోపేతం, ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకొని చికిత్స పొందేలా ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. జిల్లాలో ఫీవర్ సర్వేలు, అనుమానితులకు రక్త పరీక్షలు, పాజిటివ్ కేసులకు తక్షణ చికిత్స, నిల్వ నీటి తొలగింపు, ఫాగింగ్ మరియు లార్విసైడల్ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనీయకూడదని, దోమతెరలు వినియోగించాలని, పూర్తి చేతుల దుస్తులు ధరించాలని సూచించారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలను కోరారు. "మలేరియా పూర్తిగా నివారించగలిగే వ్యాధి. ప్రజల సహకారం ఉంటేనే దీన్ని నిర్మూలించగలం. అందరం కలిసి మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం" అని డాక్టర్ రవి రాథోడ్ పిలుపునిచ్చారు.

యూఎఫ్‌డబ్ల్యూసీ వ్యాక్సిన్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ

భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ పీహెచ్‌సీ ఎం.పీ. బంజర మరియు భద్రాచలం పట్టణంలోని యూఎఫ్‌డబ్ల్యూసీ వ్యాక్సిన్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా, వ్యాక్సిన్ నిల్వకు సంబంధించిన కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ ఫ్రీజింగ్ సదుపాయాలు, ఉష్ణోగ్రత నిర్వహణ రిజిస్టర్లు మరియు ఇతర సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. వ్యాక్సిన్లు నిర్దేశిత ఉష్ణోగ్రత పరిధిలో భద్రంగా నిల్వ చేయబడుతున్నాయా లేదా అన్నది ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రికార్డు నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలి, కోల్డ్ చైన్ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి అని సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. వ్యాక్సిన్ల నాణ్యత మరియు ప్రభావాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీ ద్వారా ప్రజలకు అందించే టీకా సేవలు సమర్థవంతంగా, ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని నిర్ధారించబడింది.

హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్‌కు చెంపపెట్టు

బీఆర్ఎస్ నేతల ఘాటు విమర్శలు

ఆలేరు, విశాలభారతి:

ఆలేరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని దురుద్దేశంతో తప్పుడు కేసులు పెడుతున్నారని, ఈ నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం ఆలేరు పట్టణంలోని రహదారి బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, "ఓటుకు నోటు కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తెలంగాణ దురదృష్టం" అని తీవ్రంగా స్పందిస్తూ. రాజకీయ ప్రతీకార దాహంతోనే బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారని ఆరోపిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు అందుతున్న నీరు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి ఫలితమేనని, దానిని తమదే కృషిగా చూపించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. కోర్టుల్లో ఎదురుదెబ్బలు తగిలినా నిజాలను ఒప్పుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హెచ్చరించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీని బలహీనపరచడానికి కాంగ్రెస్ పార్టీ స్క్రిప్టుతో కుట్రలు చేస్తున్నదని ఆరోపిస్తూ, రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. గతంలో వలసలు వెళ్లే ప్రాంతంగా ఉన్న తెలంగాణను, నేడు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ప్రజలు వచ్చే స్థాయికి తీసుకువచ్చింది కేసీఆర్ నాయకత్వమేనని గుర్తిస్తూ. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు. ఈ సమావేశంలో టంగుటూరు గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రచ్చ రామ నరసయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మామిడాల భానుచందర్, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ బాలస్వామి, మాజీ సర్పంచ్ పాండరీ, నాగరాజు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి నివారణకు చలివేంద్రం ప్రారంభం

ఆలేరు,విశాల భారతి:

వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని శారాజిపేట గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం ఆలేరు మండల అధ్యక్షులు కంతి మధు అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శారాజిపేట గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కంతి మధు మాట్లాడుతూ, వేసవి ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాటసారులు, ప్రయాణికులు తమ దాహార్తిని తీర్చుకునేందుకు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పెండ్యాల నాగరాజు, బండ శీను, కంతి బాలరాజు, కంతి బిక్షపతి, చిలుకు ప్రశాంత్, దూడల సుమలతసంతోష్, బోదాస్ సంధ్యనర్సింహులు, పుట్టల సునీతనరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకు శ్రీశైలం, చిలుకు శ్రీను, యూత్ కాంగ్రెస్ నాయకులు కంతి మహేందర్, గండికోట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది

తిరుమలగిరి, విశాలాభారతి :

కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఘోష్ కమిషన్ నివేదిక ఒక తప్పుడు తడక లాంటిది.మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ మంత్రి హరీష్ రావు మీద ఎటువంటి చర్యలు తీసుకోవద్దని తీర్పునిచ్చింది. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. కెసిఆర్,హరీష్ రావు పైన వచ్చిన ఆరోపణలు నిరాధారణమైనవి కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రైతాంగానికి లక్షల ఎకరాలకు నీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేసింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ చొరవతో వెనుకబడ్డ తుంగతుర్తి నియోజకవర్గం కూడా పచ్చటి మాగానిగా మారింది.కావున కాంగ్రెస్ ఏర్పరిచిన పిసి గోష్ కమిషన్ నివేదిక చెత్తబుట్టలో కాగితం గా మారింది. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అసమర్థ పాలనకు నిదర్శనంగా మారిందని తిరుమలగిరి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సంకపల్లి రఘునందన్ రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్, జిల్లా నాయకులు దూపటి రవీందర్, పట్టణ అధ్యక్షులు మోడపు సురేందర్,కౌన్సిలర్లు కందుకూరి గీతా, బాబు, కారుపోతుల సోమలక్ష్మినరేష్, పత్తేపురం త్రిశూల్,యాకూబ్ నాయక్, పనికిరా లక్ష్మీ యాదగిరి ,ఎస్టీ సెల్ అధ్యక్షులు యాకుబ్ నాయక్, సర్పంచులు బర్ల వెంకన్న,బొడ్డు సైదులు,జాటోత్ రవి,కందుకూరి ప్రవీణ్,మోడపు వీరన్న, మహమ్మద్ జావిద్ అలీ, మధు, చారి,పోతురాజు మల్లేష్,సురేష్ గౌడ్,ఎర్ర గణేష్,దూలం సోమయ్య, ఏల శీను పాల్గొన్నారు.

మేడే ఎర్రజెండాలు ఎగురవేసి కార్మిక ఐక్యత చాటాలి

నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

కురవి విశాలభారతి: మే డే న ఎర్రజెండాలు గ్రామ గ్రామాన ఎగురవేసి కార్మిక ఐక్యత చాటాలనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు సిపిఐ కొరవి మండల కౌన్సిల్ సమావేశం జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మికుల బలి దానలతో సాధించుకున్న 44 రకాలకార్మిక చట్టాలు రద్దు చేసి, 4కోడ్ లు గా కుదించడం,నియంతృత్వ విదానాలతో శ్రమదోపిడీ చేస్తూ హక్కులు కాలరాయడం పై శ్రమజీవులు సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఆర్ టి సి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెండు సంవత్సరాలుగా తాత్పర్యం చేయడం వల్లనే ఈనాడు కార్మికులు పోరాటబాట పట్టి ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని కాబట్టి క్షణమే వారి న్యాయమైన సమస్యలను పరిష్కారం చేసి ఆర్టీసీ కాపాడాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా అన్ని రంగాల కార్మిక సంఘాలు, గ్రామ శాఖలు ఎర్రజెండాలు ఎగురవేసి పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బొల్లం ఉప్పలయ్య, దూదికట్ల సారయ్య, నిలిగొండ నాగేశ్వరరావు, సంగెం జిన్నీ తదితరులు పాల్గొన్నారు

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నిజామాబాద్, విశాలభారతి: బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల లబ్ధిదారులకు షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు వర్ని మండల కేంద్రంలోని CCD ఫంక్షన్ హాల్లో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్దిదారులు 286 మందికి రూ 2,86,33,176/ల చెక్కులను పంపిణీ చేశారు . వర్ని మండలం 67 మంది లబ్ధిదారులకు రూ 67,07,772/ పంపిణీ చేశారుచందూర్ మండలం 33 మంది లబ్ధిదారులకు రూ 33,03,828/ పంపిణీ చేశారుమోస్రా మండలం 16 మంది లబ్దిదారులకు రూ 16,01,856/అందించారు. రుద్రూర్ మండలం 15 మంది లబ్ధిదారులకు రూ. 15,01,740/ పంపిణీ చేశారు కోటగిరి మండలం 96 మంది లబ్ధిదారులకు రూ. 96,11,136/ అందించారు.పోతంగల్ మండలం 59 మంది లబ్ధిదారులకు రూ. 59,06,844/పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కాసుల బాలరాజు వివిధ మండలాల తాసిల్దారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన

శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్

నిజామాబాద్ , విశాలభారతి: అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ళ నిర్మాణానికి ఈ స్థలాన్ని ఖరారు చేసినందున, శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే మంజూరీ తెలుపబడిన బోధన్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీ.ఈ రాందాస్, తహసీల్దార్ విఠల్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులను ప్రభుత్వాలు విస్మరించడం తగదు

ముషీరాబాద్,విశాలభారతి: రాష్ట్రంలో మాజీ సర్పంచ్ ఎంపిటీసీ కౌన్సిలర్ కార్పొరేటర్లు తమ పదవీకాలం ముగిసిన తర్వాత పట్టించుకోకుండా ప్రభుత్వాలు మాజీలను విస్మరించడం తగదని మాజీ సర్పంచ్ ఎంపిటీసీ కౌన్సిలర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మాంచాల వెంకటస్వామి అన్నారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీలకు శాశ్వత గౌరవ పింఛన్ 15 వేలు ఇవ్వాలని ఆరోగ్య కార్డులు జారీచేయాలని, డబుల్ బెడ్ రూమ్, ఉచిత బస్ పాస్, 10 లక్షల బ్యాంకు రుణం తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని, అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్న మాజీ ప్రజా ప్రతినిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజయ్య, సింగరయ్య గౌడ్, తులసి, ఇందిరా, ధనలక్ష్మి, సుజీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి – సిపిఎం డిమాండ్

- 15 రోజులు గడిచినా మిల్లుల అలాట్మెంట్ లేకపోవడం
- 20 రోజులుగా కేంద్రాల వద్దే ధాన్యం నిల్వ
- కొలికపోగు సర్వేశ్వరరావు డిమాండ్

సత్తుపల్లి, విశాలభారతి : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలిగపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, నేటికీ 15 రోజులు గడిచినా మిల్లులు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం తగదని అన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం పోసి దాదాపు 20 రోజులు గడిచిందని, గింజలు పూర్తిగా ఎండిపోయి 12 శాతాలకు వచ్చినప్పటికీ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతులు ఇప్పటికే పంటను కోయడంతో మార్కెట్లో నిల్వ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, విశాలభారతి:

జిల్లాలోని ప్రతి నివాస ప్రాంతంలో ప్రజల అవసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి. అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవిలో ఎక్కడ కూడా దాహార్తి సమస్య తలెత్తకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బోధన్ బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓ లు ఇతర అధికారులతో కలెక్టర్ మంచినీటి సరఫరా స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. రానున్న రెండు మూడు నెలలు ఎంతో కీలకమైనందున, నీటి సరఫరా విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టే విషయాన్ని ప్రజలకు సైతం ముందుగానే తెలియజేస్తే వారు తగిన విధంగా సన్నద్ధం అవుతారని సూచించారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పక్కాగా పర్యవేక్షణ జరపాలని, తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఎక్కడైనా నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. మారుమూల నివాస ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని అందించేందుకు వీలుగా ఎడపల్లి మండలం జానకంపేట వద్ద ఏర్పాటు చేసిన తరహాలోనే అనంతగిరి, నెహ్రూనగర్ గ్రామాలకు సైతం సమృద్ధిగా తాగునీటి సరఫరా కోసం ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, మంచినీటి సరఫరా వ్యవస్థకు ఎక్కడ కూడా అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పైప్ లైన్లు, వాల్వ్ లకు నష్టం కలిగేలా వ్యవహరించే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, మిషన్ భగీరథ ఈ.ఈలు రాకేష్, స్వప్న, డీఎల్పీఓలు శ్రీనివాస్, నాగరాజు, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రాజస్థాన్ మ్యూల్ అకౌంట్ ముఠా అరెస్ట్

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో రూ.78.66 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురి అరెస్ట్

సైబరాబాద్ -విశాలభారతి:

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.78,66,891 కాజేసిన కేసులో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రాజస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్రాష్ట్ర మ్యూల్ అకౌంట్ సరఫరా ముఠా గుట్టురట్టు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి, వారి నుంచి నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు, బ్యాంక్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, అరెస్టయిన నిందితులు నాగౌర్ జిల్లా గోటన్‌కు చెందిన వికాష్ ఖోకర్ (30), నాగౌర్‌కు చెందిన ఫిరోజ్ మహ్మద్ (26), జైపూర్ జగత్‌పురాకు చెందిన నితీష్ కుమార్ (19).

వీరు కమీషన్ ఆశతో అమాయకుల నుంచి బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు, కేవైసీ పత్రాలను సేకరించి సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌ల ద్వారా కాజేసిన సొమ్మును ఈ మ్యూల్ ఖాతాల ద్వారానే మళ్లిస్తున్నారు.సాంకేతిక నిఘా, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితులను హైదరాబాద్‌లో పట్టుకున్నామని సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు. ఈ నెట్‌వర్క్‌లో మరికొందరు ఉన్నారని, పూర్తి మనీ ట్రయల్ వెలికితీసేందుకు, అనుసంధానిత ఖాతాలను స్తంభింపజేసేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.డబ్బు ఆశతో బ్యాంక్ ఖాతాలు, సిమ్ కార్డులు ఇతరులకు ఇవ్వడం, అద్దెకు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీసీపీ హెచ్చరించారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా http://www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే గుర్తుతెలియని లింకులు, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయవద్దని, ఎనీడెస్క్, టీమ్ వ్యూయర్ వంటి యాప్‌లను అపరిచితుల సూచనతో ఇన్‌స్టాల్ చేయవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. కేవైసీ అప్‌డేట్, సిమ్ బ్లాక్, బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ పేరుతో వచ్చే కాల్స్ నమ్మవద్దని, పార్ట్‌టైమ్ జాబ్, క్రిప్టో ట్రేడింగ్ పేరుతో గ్యారంటీ రిటర్న్స్ ఇస్తామనే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, సీవీవీ, యూపీఐ పిన్ ఎవరితోనూ పంచుకోవద్దని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డబ్బు వస్తుందనడం మోసమని, స్కాన్ చేస్తే ఖాతా నుంచి డబ్బు డెబిట్ అవుతుందని హెచ్చరించారు.

సైబరాబాద్ ట్రాఫిక్ ఆంక్షలు



నేడు మునీరాబాద్‌లో తెలంగాణ జాగృతి పార్టీ ఆవిష్కరణ

సైబరాబాద్ -విశాలభారతి:

మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో రేపు జరగనున్న తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీ ఆవిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ జాగృతి పార్టీ ప్రారంభోత్సవం రేపు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది.ఈ సందర్భంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు, ప్రజా భద్రత దృష్ట్యా విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఎన్‌హెచ్ 44తో పాటు మునీరాబాద్ చుట్టుపక్కల అంతర్గత గ్రామ రోడ్లలో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని, కార్ ర్యాలీలు, జనసమీకరణ వల్ల మధ్యమధ్యలో ట్రాఫిక్ నెమ్మదిస్తుందని పోలీసులు పేర్కొన్నారు.మునీరాబాద్ గ్రామ రోడ్లలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు. భారీ వాహనాలను కండ్లకోయ సర్వీస్ రోడ్డు, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల మీదుగా మళ్లిస్తారు. మునీరాబాద్ గ్రామ ఎంట్రీ వద్ద సభకు హాజరయ్యే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. మిగతా వాహనాలను గోపాల ఫామ్స్ మీదుగా పూడూర్ గ్రామ రోడ్డు, కిష్టాపూర్, మేడ్చల్ మార్గాల వైపు మళ్లిస్తారు.పూడూర్ గ్రామ వై జంక్షన్ వద్ద అన్ని వాహనాలను ఆపి మేడ్చల్, పూడూర్ మార్గాల వైపు మళ్లిస్తారు. సభకు అనుమతి ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. సీఎంఆర్ కాలేజీ ఎక్స్ రోడ్డు నుంచి మునీరాబాద్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను కండ్లకోయ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా శామీర్‌పేట ఓఆర్ఆర్ వైపు మళ్లిస్తారు.రద్దీ సమయంలో మునీరాబాద్ మార్గాన్ని వీలైనంత వరకు నివారించాలని, మేడ్చల్, కిష్టాపూర్, పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంబడే పరిష్కరించండి

విశాలభారతి: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలను వెంబడే పరిష్కరించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ కోరారు తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజు రోజుకు తీవ్రతరమవుతున్నాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, సర్వీస్ నియమావళి, పదోన్నతులు, భద్రత, ప్రభుత్వం లో విలీనం, పని ఒత్తిడి వంటి అంశాలు ఉద్యోగుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. అని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముకురాల చంద్రశేఖర్ గౌడ్,బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ .దేశబోయిన రమాలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.అలాగే ఉద్యోగులు తమ హక్కుల కోసం నిరంతరం పోరాడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ముఖ్యంగా, ఈ సమస్యల కారణంగా ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యల వంటి దుర్ఘటనలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళనకరంగా ఉన్నాయి. అమూల్యమైన జీవితాలను బలి కానివ్వకండి అని ఉద్యోగులకు వేడుకున్నారు.

జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు

- డైవర్షన్ పాలిటిక్స్ కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాళేశ్వరం పై కాంగ్రెస్ సర్కార్ విష ప్రచారం మానుకోవాలి
- పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి

మేడిపల్లి విశాలభారతి: ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై హై కోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిది. ఈ తీర్పుతోనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వక్ర బుద్ధిని మార్చుకోవాలని పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాణధార కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ఇష్టమొచ్చిన రీతిలో అవాస్తవాలు చెప్పిన వారందరూ క్షమాపణ చెప్పాలి, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని రైతులు ఎప్పటికి క్షమించరు మేడిగడ్డ వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తి సన్న పగుళ్లు వస్తే మరమ్మత్తుల చేయకుండా అడ్డుకుని, నీళ్లు వదలక రైతాంగానికి ప్రజలకు ఇబ్బందులు కలుగజేసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. పగుళ్లు పెద్దవి కావడం, రాళ్లు నిర్మాణం అవశేషాలు దూరంగా ఎగురిపడడం పలు అనుమానాలతో ఇంజనీర్లు పిర్యాదు చేస్తే కనీసం విచారణ చేయకుండా నిద్రపోయింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే కదా. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి పార్లమెంటులో మెచ్చుకున్నా, ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థలు, దేశాలు మెచ్చుకున్నా గత కేసీఆర్ ప్రభుత్వాన్ని, కేసీఆర్ ప్రతిష్టను మసకబరేలాగా చేసే మీ ప్రయత్నాలు ఈ రోజు ప్రజల ముందు తేట తెల్లమయ్యాయి. ప్రాజెక్టుకు అయిన బడ్జెట్ కన్నా ఎక్కువ అవినీతి జరిగిందని చెప్పిన అబద్ధాన్నే పదే పదే కాంగ్రెస్ పార్టీ సొంత సోషల్ మీడియాలో, యూ ట్యూబ్ ఛానెళ్లలో, కొన్ని పత్రికలలో ప్రకటనల ద్వారా అబద్ధాన్నీ నిజం అని నమ్మించే ప్రయత్నం చేశారు. ఏ ఎన్నిక వచ్చినా, ప్రభుత్వంలో ఏ స్కాం బయటకు వచ్చినా డైవర్షన్ పాలిటిక్స్ చేయడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక పై హైకోర్టు తీర్పుతో ప్రభుత్వానికి కను విప్పు కావాలి, ఘోష్ కమిషన్ రిపోర్ట్ నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీర్ల పై క్రమశిక్షణ చర్యలకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని రఘువర్ధన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

అమరజీవి పోగుల ఆగయ్య త్యాగం ఆదర్శనీయం

- ఎంసీపీఐ(యు) నేత వనం సుధాకర్

శేరిలింగంపల్లి విశాల భారతి : అమరజీవి కామ్రేడ్ పోగుల ఆగయ్య జీవిత త్యాగం నేటి తరానికి ఆదర్శనీయమని, అమరవీరుల విలువలను ముందు తరాలకు అందించి దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను నిర్మించాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ పిలుపునిచ్చారు.ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరులు అమరజీవుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోగుల ఆగయ్య 33వ వర్ధంతి కార్యక్రమాన్ని మియాపూర్‌లోని ముజఫర్ అహ్మద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కర్ర దానయ్య ఆగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు కర్ర దానయ్య అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వనం సుధాకర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. "ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా చేతబట్టి అసెంబ్లీ టైగర్ మద్దికాయల ఓంకార్ అడుగుజాడల్లో కడవరకు పోరాడిన ఎర్రజెండ ముద్దుబిడ్డ ఆగయ్య. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నీతిగా, నిజాయితీగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరించి కష్టజీవులకు అండగా నిలబడ్డ గొప్ప నాయకుడు" అని కొనియాడారు.కుటుంబం కంటే వ్యవస్థ కోసం పార్టీ మిన్నగా పనిచేశారని, రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలని నిక్కచ్చిగా పోరాడిన రైతు ఉద్యమ నేత ఆగయ్య అని గుర్తుచేశారు. ఆనాటి నక్సలైట్లు ఆగయ్యను హతమార్చడం పార్టీకి, సమాజానికి తీరని లోటని అన్నారు.పాలకుల విధానాలతో దోపిడీ, అవినీతి, నిరుద్యోగం, ఆకలి చావులు పెరిగిపోతున్నాయని, పోరాడే శక్తులపై నియంతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో చైతన్యం, ధైర్యం నింపి రాజకీయ విలువలను కాపాడుకొని సమసమాజ స్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి టి. అనిల్ కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, అంగడి పుష్ప, పల్లె మురళి, ఇస్లావత్ దశరథ్ నాయక్, కర్ర దానయ్య, సభ్యులు శివాని, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

శ్రేయస్ ఇంజనీరింగ్ కళాశాలపై తీవ్ర ఆరోపణలు

- హాజరు మోసాలు, పరీక్షల నిరాకరణ .. యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : నాగోల్ బండ్లగూడలోని శ్రేయస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. విద్యార్థులను స్పోర్ట్స్ కార్యక్రమాల పేరుతో సుమారు 20 రోజుల పాటు తీసుకెళ్లి, ఆ కాలానికి సంబంధించిన హాజరు సరైన విధంగా నమోదు చేయకుండా తక్కువ శాతంగా చూపిస్తూ, పరీక్షలకు అనుమతించకపోవడం ద్వారా వారి భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల వాదన ప్రకారం, కనీసం 20 శాతం హాజరు నమోదు కావాల్సి ఉండగా, కాలేజీ యాజమాన్యం కేవలం 52 శాతం మాత్రమే చూపించి, సీనియర్ విద్యార్థులను జూనియర్లతో కలిసి పరీక్షలు రాయాలని ఒత్తిడి తెస్తోందని తెలిపారు. ఇది ఉద్దేశపూర్వకంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడమేనని మండిపడుతున్నారు.కాలేజీ ప్రిన్సిపల్, ఫ్యాకల్టీ వ్యవహార శైలిపై కూడా విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనుచిత వ్యాఖ్యలు, అవమానకర ప్రవర్తనతో విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూడా చోటుచేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశంపై అధికారికంగా నిర్ధారణ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాగోల్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఇలాంటి అనేక ఫిర్యాదులు ఉన్నాయని, పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసి, పరీక్షలు రాయనివ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం అత్యంత అన్యాయమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టేలా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ కార్మికుడి మృతి

ఇది ఆత్మహత్య కాదు, ప్రభుత్వ హత్య" అంటూ కార్మిక సంఘాల ఆగ్రహం

సైబరాబాద్ విశాల భారతి: ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై తీవ్ర దుమారం రేగుతోంది. ఇది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ విధానాల వల్ల జరిగిన హత్యేనని కార్మిక సంఘాలు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బకాయిలు చెల్లించకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడంతోనే శంకర్ గౌడ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం ఉదయం శంకర్ గౌడ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యుల ఆవేదన....

"గత కొన్ని నెలలుగా జీతాలు సరిగా రావడం లేదు. అప్పులు పెరిగిపోయాయి. పిల్లల చదువులు, ఇంటి అద్దె కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నాడు. యాజమాన్యానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యమే నా భర్తను పొట్టన పెట్టుకుంది" అని మృతుడి భార్య కన్నీటి పర్యంతమయ్యారు.

కార్మిక సంఘాల డిమాండ్...

ఆర్టీసీ జేఏసీ నేతలు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. "కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బకాయిలు ఇవ్వరు, పీఎఫ్, సీసీఎస్ డబ్బులు జమ చేయరు. ఒత్తిడి తట్టుకోలేక కార్మికులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే" అని జేఏసీ కన్వీనర్ మండిపడ్డారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ యాజమాన్యం స్పందిస్తూ, శంకర్ గౌడ్ మృతి బాధాకరమని, కుటుంబానికి నిబంధనల ప్రకారం సాయం అందిస్తామని తెలిపింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. శంకర్ గౌడ్ మృతితో ఆర్టీసీ డిపోల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సెలవుల్లోనూ క్లాసులు

ఫిజిక్స్ వాలాపై చర్యలకు ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్

సైబరాబాద్, విశాలభారతి : ఇంటర్మీడియట్ బోర్డు సెలవులు ప్రకటించినప్పటికీ ఫిజిక్స్ వాలా, మాద్యులేస్ కళాశాలలు ఐఐటీజేఈఈ సమ్మర్ క్లాసుల పేరుతో విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్య మార్చి 30 నుంచి జూన్ 2 వరకు ఇంటర్ విద్యార్థులకు సెలవులు ప్రకటించిందని, అయినప్పటికీ పలు కార్పొరేట్ కళాశాలలు సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నాయని విద్యార్థుల ఫిర్యాదులతో తమ దృష్టికి వచ్చిందని పల్లె మురళి తెలిపారు. పదో తరగతి ఫలితాలు వెలువడకముందే బ్రిడ్జ్ కోర్స్ పేరుతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, అక్రమంగా అడ్మిషన్లు, పుస్తకాల అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘాలు కళాశాలలకు వెళ్లగా "అధికారుల అండదండలతోనే కళాశాలను సమ్మర్‌లో నిర్వహిస్తున్నాం" అని యాజమాన్యాలు చెబుతున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై రంగారెడ్డి డీఐఈఓ వెంక్య నాయక్‌కు ఫిర్యాదు చేశామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరామని పల్లె మురళి వెల్లడించారు.

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ

గ్రామ అభివృద్ధి, ప్రజా భాగస్వామ్యంపై విస్తృత చర్చలు

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభను నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, గ్రామ కార్యదర్శి నీలం రాఘవేందర్, ఉపసర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మహిళా సంఘ అధ్యక్షులు, అంగన్వాడీ టీచర్, గ్రామ పెద్దలు హాజరయ్యారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గచ్చిబౌలిలో గంజాయి ముఠా గుట్టురట్టు

కేజీన్నర గంజాయి స్వాధీనం, బెంగాల్ యువకుడు అరెస్ట్

సైబరాబాద్‌విశాలభారతి: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన మెరుపు దాడుల్లో 1.523 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువకుడిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. గురువారం గోపన్‌పల్లి ఎన్‌టీఆర్ నగర్‌లోని అపర్ణ లేబర్ క్యాంప్‌లో గంజాయి నిల్వ ఉందన్న విశ్వసనీయ సమాచారం అందడంతో ఉన్నతాధికారుల అనుమతితో గచ్చిబౌలి ఎస్సై ఎం. అక్షిత ఆధ్వర్యంలో పోలీసు బృందం ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం దాడి నిర్వహించింది.ఈ క్రమంలో అక్కడ నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మధుసూదన్ హవల్దార్, వయసు 23 సంవత్సరాలు, పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో అతని గదిని తనిఖీ చేయగా 1.523 కిలోల గంజాయితో పాటు తూకం యంత్రం, ప్యాకింగ్ సామగ్రి, ఒక మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి.ప్రాథమిక విచారణలో నిందితుడు బెంగాల్ నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కూలీలకు, యువకులకు విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించాడు. ఈ ముఠాకు ప్రధాన సరఫరాదారుగా మనిక్ దాస్ ఠాకూర్ వ్యవహరిస్తున్నట్లు, అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇతర వస్తువులను పోలీసులు భద్రపరిచి, నిందితుడు మధుసూదన్‌ను ఈరోజు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశామని, నగరంలో మాదకద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచామని గచ్చిబౌలి పోలీసులు వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికులపై అణచివేతను సహించం: బీఎస్పీ

కాలయాపన కమిటీలను రద్దు చేసి, వెంటనే విలీన హామీ అమలు చేయాలని డిమాండ్

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అధ్యక్షులు గుండె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా బస్ డిపో వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఆర్టీసీ కార్మికులను రోడ్డుపైకి నెట్టడం దుర్మార్గమని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా మాజీ ఇంచార్జ్ పల్లాటి రాములు, జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల మంది కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తుండగా, ప్రభుత్వం స్పందించకుండా 'ఐఏఎస్ అధికారుల కమిటీ' పేరుతో కాలయాపన చేయడం కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. కార్మికులపై కక్షసాధింపు చర్యలు హేయమని పేర్కొంటూ, ఆర్టీసీలో పనిచేస్తున్న వారిలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారేనని గుర్తుచేశారు. బహుజన వర్గాల శ్రమతో నడుస్తున్న సంస్థను నిర్వీర్యం చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. కార్మికుల పెన్షన్, సీసీఎస్ (CCS), పీఎఫ్ (PF) నిధులపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. సుమారు ₹ 3,000 కోట్ల నిధులను ఇతర అవసరాలకు మళ్లించి, ఇప్పుడు జీతాలు చెల్లించడానికి నిధులు లేవని చెప్పడం అసత్యమని ఆరోపించారు. ఇది కార్మికులపై ఆర్థిక దౌర్జన్యమని విమర్శించారు. 2023లో అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన ఆర్టీసీ విలీన హామీని అమలు చేయకుండా కొత్త కమిటీల పేరుతో ఆలస్యం చేయడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో ఉంటే, తక్షణమే సర్వీస్ రూల్స్ ఖరారు చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.సమ్మె కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కార్మికులు బాధ్యులు కాదని, చర్చలు జరపకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

యువతతో 'కాఫీ విత్ ఏ కాప్'

సైబరాబాద్ పోలీస్ వినూత్న కార్యక్రమం

సైబరాబాద్ - విశాలభారతి

సైబరాబాద్ పోలీస్, ఎస్‌సీఎస్‌సీ సంయుక్తంగా 'కాఫీ విత్ ఏ కాప్' కార్యక్రమాన్ని ప్రారంభించాయి. కాన్వర్స్, కనెక్ట్, కొలాబరేట్ థీమ్‌తో యువత, ఉద్యోగులను పోలీసులకు మరింత చేరువ చేసేందుకు ఈ నెలవారీ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రారంభ సమావేశానికి డీజీ విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్, డీజీ సీఎస్‌బీ & ఎఫ్‌ఎస్‌ఎల్ శిఖా గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సైబరాబాద్ సీపీ, ఎస్‌సీఎస్‌సీ చైర్మన్ డాక్టర్ ఎం. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్ 1 రంజన్ రతన్, డీసీపీ కూకట్‌పల్లి రితిరాజ్, డీసీపీ ట్రాఫిక్2 శేషాద్రిని రెడ్డి, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్ ఖాన్, పలువురు పోలీసు అధికారులు, కార్పొరేట్ నేతలు పాల్గొన్నారు. స్టార్టప్ వ్యవస్థాపకులు, కళాశాల విద్యార్థులు, యువ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రత, సైబర్ సేఫ్టీ, బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తనపై ప్రశ్నలు సంధించారు. మహిళల భద్రతపై శిఖా గోయల్ మాట్లాడుతూ భౌతిక, డిజిటల్ వాతావరణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో చాటింగ్ చేయడం, డబ్బులు పంపడం, అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయడం, వీడియో కాల్స్ అటెండ్ కావద్దని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఏపీకే ఫైల్ ట్రాప్‌లు, మోసపూరిత పెట్టుబడి పథకాలతో విద్యావంతులు సైతం మోసపోతున్నారని, అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ సైబరాబాద్‌లో రెండేళ్లలో ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులు పూర్తవుతాయని, దీంతో ట్రాఫిక్ ఫ్లో మెరుగుపడుతుందని తెలిపారు. రోడ్లపైన, డిజిటల్ స్పేస్‌లోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పౌరులకు సూచించారు. విద్యార్థి ఎం. అద్వైత్ ప్రజా భద్రతలో యువత పాత్రపై ప్రశ్నలు లేవనెత్తగా అధికారులు స్పష్టత ఇచ్చారు. విద్యార్థిని సంస్కృతి స్టార్టప్‌లకు సైబర్ రెసిలియెన్స్‌పై, విద్యార్థిని ఆయిషా పురుషాధిక్య సమాజంలో యువతులు ఆత్మవిశ్వాసంతో ఎదగడంపై సలహాలు కోరారు. 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ కింద సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు, డిజిటల్ జాగ్రత్తలపై అధికారులు ఆచరణాత్మక సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అవేర్‌నెస్, షీ టీమ్స్, భరోసా సెంటర్, టీజీఏఎన్‌బీ, సైబర్ క్రైమ్స్, ఎస్‌సీఎస్‌సీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. హెల్మెట్లు, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ రాడార్‌లు, ట్రాఫిక్ సిగ్నల్ మోడల్స్‌తో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, మాదక ద్రవ్యాల నివారణపై బ్రోచర్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా సమాచారం అందించారు. యువతతో పోలీసుల మధ్య నమ్మకం, సంభాషణ పెంచేందుకు 'కాఫీ విత్ ఏ కాప్' వేదిక ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మధుయాష్కి గౌడ్

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :

కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో దివ్యాంగులకు త్రిచక్ర స్కూటీల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, స్థానిక ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పాల్గొని ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు త్రిచక్ర స్కూటీలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు హెల్మెట్లు, శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు.దివ్యాంగుల సాధికారత కోసం వాహనాల పంపిణీ చేపట్టామని తెలిపారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మైనారిటీలకు కుట్టుమిషన్లు, ఈస్కూటర్లను కూడా అందజేస్తున్నట్లు గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని వివరించారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, డీఆర్‌సీ రమేష్, సూపరింటెండెంట్ ఇమ్రానుద్దీన్, అధికారులు వనజ, గీత, చంద్రపావని, యాదగిరి, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, రాగుల వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యమా..?

- **మహిళ మృతి ఘటనపై ఆసుపత్రి యాజమాన్యంపై ఆరోపణలు**
- **మరణించిన తర్వాత కూడా చికిత్స పేరుతో డబ్బులు వసూలు చేశారంటూ కుటుంబ సభ్యుల ఆగ్రహం**



విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడలోని మహోనియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన తీవ్ర వివాదానికి దారి తీసింది. పోల్కంపల్లి గ్రామానికి చెందిన కట్టెల దివ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా, చికిత్సలో నిర్లక్ష్యం కారణంగా ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, దివ్య ఆరోగ్య పరిస్థితి విషమించిందని తెలియజేయకుండా, ఆమె అప్పటికే మృతి చెందిన తరువాత కూడా చికిత్స కొనసాగుతోంది అని చెప్పి ఆసుపత్రి సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. డబ్బులు చెల్లించిన వెంటనే ఆమె మరణించినట్లు వెల్లడించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారం వైద్య రంగంలో నైతిక విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి పరిస్థితిని పారదర్శకంగా వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆసుపత్రి యాజమాన్యం లాభాపేక్షతో వ్యవహరించిందని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల బాధను అవకాశంగా తీసుకుని ఆర్థిక లాభాల కోసం ఇలా వ్యవహరించడం తీవ్రంగా ఖండనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి ఘటనలు ప్రజల్లో ప్రైవేట్ ఆసుపత్రులపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని వారు అంటున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నియంత్రణలు అమలు చేయాలని కోరుతున్నారు.

చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది

- **ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబెట్టడం తగదు**
- **ప్రమాదాలు జరిగితే అందుకు బాధ్యులు మీరే**
- **రూరల్ ఎస్సై బి. సురేష్ హెచ్చరిక**

పాల్వంచ రూరల్: విశాల భారతి: పాల్వంచ మండలంలో ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబెట్టడంపై రూరల్ ఎస్సై బి. సురేష్ స్పందించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని రహదారులను ఆక్రమిస్తూ ధాన్యం ఆరబెట్టడం తీవ్ర నిర్లక్ష్య చర్య అని ఆయన మండిపడ్డారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు బాధ్యత పూర్తిగా రైతులదేనని స్పష్టం చేశారు. రహదారులు సగానికి పైగా ఆక్రమించి ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో కూడా ఇలాంటి కారణాలతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు వర్షాకాలంలో కనిపించకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని హెచ్చరించారు. ఇకపై ఇలాంటి చర్యలను సహించబోమని, నియమాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని గుర్తు చేశారు. రైతులు తప్పనిసరిగా ఖాళీ ప్రదేశాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలని సూచించిన ఎస్సై, రైతుల సమస్యలను అర్థం చేసుకుంటూనే ప్రజల భద్రతను కాపాడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అవసరమైతే గ్రామస్థాయిలో తగిన ప్రదేశాలను గుర్తించి ధాన్యం ఆరబెట్టేందుకు అధికారులు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజల సహకారం లేకుండా రహదారి భద్రత సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. రైతులు కూడా నియమాలను పాటిస్తూ తమ పంటను సురక్షితంగా సంరక్షించుకోవాలని సూచించారు

ఈ నెల 26న బండ్లగూడలో హిందూ సమ్మేళనం

రూ. 2,11,000 విరాళం అందజేసిన నీరుడు శేఖర్ ముదిరాజ్

రాజేంద్రనగర్,విశాలభారతి : బండ్లగూడ జాగీర్‌లో ఈ నెల 26వ తేదీన సాయంత్రం నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, మన సంప్రదాయాలు మరియు సంస్కృతిని పరిరక్షించడం ప్రధాన లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహించబడుతోంది. ఇప్పటికే బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో ప్రచార కార్యక్రమాలు చేపడుతూ, ప్రతి హిందూ బంధువు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు కిస్మత్ పూర్ మాజీ ఉపసర్పంచ్ శ్రీ నీరుడు శేఖర్ ముదిరాజ్ గారిని ఆహ్వానించారు. కమిటీ పిలుపునకు స్పందించిన ఆయన సమాజ సేవా దృక్పథంతో ముందుకు వచ్చి కార్యక్రమ నిర్వహణకు తమ వంతు సహకారంగా ₹2,11,000/ (రెండు లక్షల పదకొండు వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శేఖర్ ముదిరాజ్ గారి సేవా భావాన్ని అభినందిస్తూ, సమాజంపై ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన అందించిన సహకారం ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ నీరుడు శేఖర్ ముదిరాజ్ గారు హిందూ సమాజ ఐక్యత కోసం ఇలాంటి సమ్మేళనాలు అత్యంత అవసరమని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. బండ్లగూడ జాగీర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరూ కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమ్మేళనాన్ని ఘన విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయాలి

రాజేంద్రనగర్, విశాలభారతి : ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని శంషాబాద్ తహసీల్దార్ కె. రవీందర్ దత్, మండల వ్యవసాయశాఖ అధికారి శ్వేత తెలిపారు. గురువారం శంషాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై వ్యవసాయ విస్తరణ అధికారులు, మీ సేవ కేంద్రాల ప్రతినిధులు, గ్రామ పరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోని ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు ద్వారా గుర్తింపు కల్పించినట్లుగానే, ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని వివరించారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీపంలోని రైతు వేదిక లేదా మీ సేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 23 నుండి మే 2 వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయిబ్ తహసీల్దార్ వాణి, గ్రామ పరిపాలన అధికారులు, మీ సేవ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆర్యవైశ్య సంఘం బండ్లగూడ జాగీర్ లోగో ఆవిష్కరణ

రాజేంద్రనగర్, విశాలభారతి : కొత్తగా ఏర్పడిన ఆర్యవైశ్య సంఘం, బండ్లగూడ జాగీర్ అధికారిక లోగో ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మన కులదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి పాదాల చెంత పూజలతో ప్రారంభించారు. తదనంతరం, అయ్యవారు అయిన నగరిశ్వరుని సన్నిధిలో సంఘం లోగోను ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ వెంకటరమణ జువెల్లర్స్ అధినేత మరియు సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీ పలబట్ల సతీష్ కుమార్ గారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మరియు రేణుక ఎల్లమ్మ దేవాలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం, వాసవి అమ్మవారి దేవాలయంలో కూడా సంఘం లోగోను ప్రదర్శించారు. వాసవి జయంతిని పురస్కరించుకుని, సంఘం కమిటీ తరపున అమ్మవారికి జయంతి రోజున అలంకరణ కోసం పట్టు చీరను సమర్పించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రేణుక ఎల్లమ్మ కమిటీ సభ్యులకు, అలాగే ఆలయ కమిటీ సభ్యులకు ఆర్యవైశ్య సంఘం బండ్లగూడ జాగీర్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రెసిడెంట్ రావికంటి కిషన్, EC మెంబర్ వేముల రాములు, ఆలయ కమిటీ సభ్యులు, అలాగే సంఘం ప్రెసిడెంట్ రావికంటి వినయ్ కుమార్, జనరల్ సెక్రటరీ సుంకు లక్ష్మీనారాయణ, కోశాధికారి కొక్కుళ్ళ వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రామ్ మోహన్ దరిశా, జాయింట్ సెక్రటరీ రావికంటి ఆదిత్య, EC మెంబర్లు అమరవాది నరేష్ కుమార్, బిలకంటి హరీష్, చీకటిమర్ల సురేష్ దంపతులు, బెస్త వేముల సుదర్శన్, బిక్కుమల్ల రాము, రవి ముసిరిఫా, కొత్తగుండ్ల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాలు సరే... కొనుగోళ్లు ఏవి?

- కొనుగోలు కేంద్రాలున్నా ఇబ్బందుల్లో రైతులు – సిపిఎం
- కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతుల్లో ఆందోళన
- కొనుగోలు కేంద్రాలు ఉన్నా ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదు
- వర్షా ల భయంతో రైతులు ఆందోళనలో
- ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్మకాల పరిస్థితి

సత్తుపల్లి, విశాలభారతి : గ్రామానికి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పినప్పటికీ, ఆచరణలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ సమావేశం శుక్రవారం రావి వీర వెంకయ్య భవనంలో బాల బుచ్చయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వరి కోతలు ప్రారంభమై ధాన్యరాశులు పోసుకున్న రైతులకు ప్రభుత్వం నేటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి చేతులు దులుపుకుందన్నారు. దిక్కుతోచని రైతులు తమ పంటలను పట్టణాల్లోనే దళారులకు విక్రయిస్తున్నారని తెలిపారు.మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు పంటలు కోసి ధాన్యాన్ని రాశులుగా పోశారని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఎప్పుడు వానలు కురుస్తాయోనని రైతులు బిక్కుబిక్కుమంటున్నారని చెప్పారు. గతంలో పంట కోతలు ప్రారంభమైన వెంటనే రైతులకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు పట్టాలు అందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఊసే లేకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని 50 శాతం వరకు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించి, వారు మిల్లర్లకు తరలిస్తున్నారని అన్నారు. ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి మిల్లులు, గోదాములు ఖాళీగా లేవని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే లెక్కలేదనే ధోరణి కనిపిస్తోందని విమర్శించారు.ఇప్పటికైనా అధికారులు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, అయినంపూడి సనందరావు, కువ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, తడికమళ్ళ రామకృష్ణ, ఎలగం కృష్ణయ్య, ఎలగం రాములు, దాట్ల రాంబాబు, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సి.సి రోడ్ పనుల్లో నిర్లక్ష్యం – అధికారులపై మాజీ కార్పొరేటర్ ఆగ్రహం

పనులు వేగవంతం చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ ప్రాంతంలో బొమ్మల గుడి రోడ్డు నుండి తట్టి అన్నారం, నాగోల్ వైపు వెళ్లే ప్రధాన సి.సి రోడ్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఆయన బొమ్మల గుడి నుండి డబుల్ బెడ్ రూమ్ ప్రాంతం మీదుగా తట్టి అన్నారం, నాగోల్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో మంజూరైన సి.సి రోడ్ పనులు గత రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయని, యంయం సి అధికారులు మరియు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు. ఈ నిర్లక్ష్యంతో దాదాపు 30 కాలనీల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో కాలనీల సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ప్రధాన కార్యాలయం, ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, బీజేపీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపు గచ్చిబౌలిలో 3 గంటలు విద్యుత్తు నిలుపుదల

ఈ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 వరకు సరఫరా బంద్: ఏడీఈ శివ కృష్ణ ప్రసాద్

శేరిలింగంపల్లి, విశాలభారతి: కొత్త విద్యుత్తు కనెక్షన్ల విడుదల పనుల నిమిత్తం గచ్చిబౌలి ఉప విభాగం పరిధిలో రేపు, ఏప్రిల్ 25వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు సహాయ డివిజనల్ ఇంజనీరు శివ కృష్ణ ప్రసాద్ తెలిపారు. 11కేవీ చర్చి ఐటీ వాహకం పరిధిలోని నానక్‌రాంగూడ, అలేఖ్య నివాసాలు, విజయ కృష్ణ భవనం, డొమినోస్ ప్రాంతం, గోల్ఫ్ వీక్షణం, అగ్నిమాపక కేంద్రం పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.ప్రజలు గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, సహకరించాలని ఆయన కోరారు.

సంప్రదించుటకు: ఏడీఈ/గచ్చిబౌలి శివ కృష్ణ ప్రసాద్ 8712469628 ఫ్యూజ్ అత్యవసర సేవ 8712469652

పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ

ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి లక్ష్యాలపై చర్చలు

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం చిన్న రావిర్యాల గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సభలో చర్చించారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొంటూ, గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ అధ్యక్షత వహించగా, గ్రామ కార్యదర్శి సునీత, ఉపసర్పంచ్ శిరీష శంకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డ్ సభ్యులు అకిటి రామకృష్ణ రెడ్డి, నారెడ్డి రిషిత, సతీష్ రెడ్డి, రాపోల్ మలేష్, మహిళా సంఘ అధ్యక్షురాలు కొమరేలీ రేణుకతో పాటు అంగన్వాడీ టీచర్, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చిర్రా రవీందర్ యాదవ్

శేరిలింగంపల్లి, విశాలభారతి: శ్రీవారిని భారాస రాష్ట్ర సీనియర్,ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ వీఐపీ బ్రేక్ దర్శనంలో దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం మాట్లాడుతూ.. జగిత్యాల సభతో కాంగ్రెస్ పతనం మొదలైందని, ప్రజలే చిత్తుగా ఓడిస్తారని అన్నారు. సీఎం రేవంత్ హైదరాబాద్ అభివృద్ధిలో విఫలమయ్యారని, కేటీఆర్ చేసిన అభివృద్ధే చిరస్థాయిగా నిలుస్తుందని విమర్శించారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని చిర్రా రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు.

డ్రైవర్ ఆత్మహత్యాయత్నం బాధాకరం

ఆత్మహత్యలు కాదు – ఐక్య పోరాటమే పరిష్కారం.. ప్రభుత్వం వెంటనే స్పందించాలి

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ ఎదుట ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న మనస్తాపంతో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవడం బాధాకరమని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ పేర్కొన్నారు. అయితే, తోటి సిబ్బంది అప్రమత్తంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చి, ఆయనను తక్షణమే ఆసుపత్రికి తరలించడం మార్గం మధ్యలో డ్రైవర్ మరణించడం బాధాకరం .ఈ సందర్భంగా గ్యార మల్లేష్ మాట్లాడుతూ.. ఇలాంటి ఆత్మహత్యాయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు పరిష్కారం కావని స్పష్టం చేశారు. ప్రాణం అమూల్యమని, కార్మికులు, ఉద్యోగులు ఎవరూ ఇలాంటి తీవ్ర నిర్ణయాలకు వెళ్లకుండా ధైర్యంగా, ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. పోరాడితే కోల్పోయేదేమీ లేదు – బానిస సంకెళ్లు తప్ప అని ఆయన అన్నారు.ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకుని పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ద్వారా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.కార్మికుల న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, అయితే ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలను పూర్తిగా నివారించాలని గ్యార మల్లేష్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

సైబరాబాద్‌లో నంబర్ ప్లేట్లపై పోలీసుల కొరడా

- ట్రాఫిక్-2 పరిధిలో ఒక్కరోజే 383 కేసులు, రూ.80,600 జరిమానా
- నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు: డీసీపీ శేషాద్రిని రెడ్డి

సైబరాబాద్ ,విశాలభారతి:

నంబర్ ప్లేటు లేకుండా, ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా స్టైలిష్ ఫాంట్లు, డిజైన్లు, స్టిక్కర్లతో వాహనాలపై చెలరేగుతున్న వారికి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. రోడ్డు భద్రతతో పాటు నేర నియంత్రణలో భాగంగా డీసీపీ ట్రాఫిక్2, సైబరాబాద్ S. శేషాద్రిని రెడ్డి ఆదేశాలతో శుక్రవారం భారీ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ట్రాఫిక్2 పరిధిలోని 8 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల వద్ద వాహనాలను ఆపి నంబర్ ప్లేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎక్కడెక్కడ తనిఖీలు చేశారంటే...

పటాన్‌చెరు పీఎస్: పటాన్‌చెరు బస్‌స్టాండ్
ఆర్‌సీ పురం పీఎస్: బీహెచ్‌ఈఎల్ రోడ్డు
మియాపూర్ పీఎస్: మియాపూర్ ఎక్స్ రోడ్డు, ఆల్విన్ ఎక్స్ రోడ్డు
కేపీహెచ్‌బీ పీఎస్: జేఎన్‌టీయూ కూడలి
కూకట్‌పల్లి పీఎస్: కైతలాపూర్ రోడ్డు, తులసీవనం రోడ్డు, బాలానగర్ మెట్రో స్టేషన్ కింద, ఐడీఎల్ లేక్ రోడ్డు
బాలానగర్ పీఎస్: నర్సాపూర్ ఎక్స్ రోడ్డు, ఎర్రగొడలు, జగద్గిరిగుట్ట రోడ్డు
జీడిమెట్ల పీఎస్: సూరారం, పీఎస్ ఎదుట
మేడ్చల్ పీఎస్: మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం, పీఎస్ ఎదుట, సుచిత్ర, కుత్బుల్లాపూర్ రోడ్డు

ఒక్కరోజులోనే భారీగా కేసులు

ఈ డ్రైవ్‌లో మొత్తం 383 వాహనాలపై మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేసి రూ.80,600 జరిమానా విధించినట్లు డీసీపీ శేషాద్రిని రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

"ఇది భద్రతకు సంబంధించిన అంశం" - డీసీపీ

"నంబర్ ప్లేటు అనేది వాహనానికి గుర్తింపు. నేరం జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడానికి ఇదే కీలకం. కొందరు కావాలనే నంబర్లు కనిపించకుండా టెంపర్డ్ గ్లాస్‌లు, ఫ్యాన్సీ రాతలు పెట్టుకుంటున్నారు. ఇది చట్టవిరుద్ధం. ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ తప్పనిసరి" అని డీసీపీ స్పష్టం చేశారు.ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలు, నేరాలు తగ్గుతాయని, ఇలాంటి డ్రైవ్‌లు ముందుముందు మరింత ముమ్మరంగా కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. వాహనదారులు వెంటనే ఆర్టీఏ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని సూచించారు.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు గెజిటెడ్ ధృవీకరణతో ఇబ్బందులు

- సర్టిఫికెట్ల కోసం తిరగలేకపోతున్న ఏజెన్సీ వాసులు
- ఆర్ఐ తీరుతో ఇబ్బందులు పడుతున్నామంటున్న జనం

అశ్వాపురం, విశాలభారతి :

ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలకు గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ధ్రువీకరణను కచ్చితంగా చేయించాల్సిందేనని రెవెన్యూ అధికారులు అనడంతో అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుండి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయానికి వచ్చేవారు గెజిటెడ్ సంతకాలు ఎవరితో పెట్టియాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే గెజిటెడ్ అధికారుల దగ్గరకు ఏజెన్సీ ప్రాంతాల నుండి వెళుతున్నవారు తమ కుటుంబీకుల్లో ఒకరు మృతి చెందారు తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం సంతకం చేసి ధ్రువీకరించాలని అధికారుల వద్దకు వెళుతున్నప్పటికీ సంతకాల కోసం వెళ్లినవారు ఆ సంబంధిత గెజిటెడ్ ఆఫీసర్లకు వారి వివరాలు పూర్తిగా తెలియకపోవడంతో ధ్రువీకరించేందుకు నిరాకరిస్తున్నారని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మృతుడు పేరున బ్యాంకులలో నగదు, ఆస్తులకు సంబంధించిన పంపకాలకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో సర్టిఫికెట్ కోసం రెవెన్యూ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్న అర్జీదారులకు గెజిటెడ్ నాన్ గెజిటెడ్ వాంగ్మూలం తప్పనిసరి చేయడంతో ఇప్పుడు మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ఏజెన్సీ నుండి మండుతున్న ఎండల్లో కూడా ప్రతిరోజు కార్యాలయానికి వచ్చి చెట్ల కింద కూర్చొని పనులు కాక వెనిధులకు వెళ్తున్నామని ధ్రువీకరణ పత్రాల కోసం వస్తున్న వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

ఆర్ ఐ విచారణకు రావట్లేదు అంటున్న అర్జీదారులు

రెవెన్యూ కార్యాలయంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు మీ సేవల ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే విషయంలో ఆర్ ఐ అర్జీ పెట్టుకున్న వారి గ్రామాలకు విచారణకు రావడం లేదని పలువురు అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ల మంజూరు చేసేందుకు సంబంధిత ఆయా అర్జీదారుల గ్రామాలకు వెళ్లి స్వయంగా వారి ఇంటి వద్ద విచారణ చేయాల్సి ఉన్నప్పటికీ ఆర్ఐ వెళ్లకుండా కేవలం కార్యాలయానికే పరిమితం అవుతుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సర్టిఫికెట్ల కోసం వెళితే సరైన సమాధానం కూడా చెప్పడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల మంజూరీ విషయంలో గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ధ్రువీకరణలు లేకుండా ఆర్ఐనే స్వయంగా గ్రామాలలో కొచ్చి విచారణ చేపట్టి నిర్ణీత గడువు లోపు సర్టిఫికెట్లు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సి.సి రోడ్ నిర్మాణ పనులపై MMC అధికారులు నిర్లక్ష్యం

ఎల్బీనగర్ విశాలభారతి: మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ లో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్తానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి నిర్మిస్తున్న బొమ్మల గుడి నుండి డబల్ బెడ్ రూమ్,తట్టి అన్నారం మరయు నాగోల్ కి వెళ్లే ప్రధాన దారి సీ.సీ రోడ్డు పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సి.సి రోడ్డు నిర్మాణం పనులు MMC అధికారులు మరియు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన సుమారు రూ: 2.00 కోట్ల నిధులతో సాంక్షన్ అయిన పనులను దాదాపు రెండు నెలల నుండి కొనసాగుతున్న పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని దాదాపు 30 కాలనీవాసులకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని,అధికారుల నిర్లక్ష్యం వహించకుండా తొందరగా పనులు పూర్తి చేసి ప్రజలు పడుతున్న సమస్యను పరిష్కరించాలని రోడ్లను తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని, లేనియెడల దాదాపు 30 కాలనీలో సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ప్రధాన కార్యాలయాన్ని, ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘ సభ్యులు మరియు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలన

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : హయత్ నగర్ అనుమగల్ ప్రాంతంలో కొనసాగుతున్న అభ్యుదయ యువజన సంఘం భవన నిర్మాణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ, నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. యువజన సంఘం భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం, స్థానిక యువతకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇది ఒక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రాంతం సమానంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్దేశిత గడువులోనే పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, హయత్ నగర్ మాదిగ సంఘం అధ్యక్షులు జెనిగే కుమార్, బస్తీ వాసులు గంగాని లక్ష్మయ్య, జయ ఈశ్వర్, జెనిగే గిరి, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసనలకు బిఆర్ఎస్ మద్దతు

రాజేంద్రనగర్, విశాలభారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం గత మూడు రోజులుగా బస్సులు బంద్ చేసి రోడ్డుపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులకు మద్దతుగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు. ఈ ఘటనను "ప్రభుత్వ హత్య"గా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులు కోరుతున్నవి న్యాయమైన డిమాండ్లేనని, వాటిని వెంటనే పరిష్కరించకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. అనంతరం కొద్దిదూరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కార్మికులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

రూ.1.84 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

రాజేంద్రనగర్, విశాలభారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే టి . ప్రకాష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం అత్తాపూర్ సర్కిల్‌లోని కాటేదాన్ సెక్షన్ (మైలార్‌దేవ్‌పల్లి వార్డ్ 117) పరిధిలో దుర్గా వెంచర్ ప్రాంతంలో కొత్త మంచినీటి పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మెట్రోపోలీటన్ వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో రూ.1.84 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. అయ్యప్ప టెంపుల్ సమీపంలోని గృహ సముదాయాలకు తాగునీటి సరఫరా మెరుగుపర్చేలా 200 మి.మీ, 150 మి.మీ మరియు 100 మి.మీ వ్యాసం గల పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ పనులు పూర్తయితే కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో నీటి కొరత సమస్య శాశ్వతంగా తొలగిపోతుందని చెప్పారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు: జిల్లా కలెక్టర్ అంకిత్

పాల్వంచ, విశాలభారతి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్ లో నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ కాలవ్యవధి, శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా 2010లో స్థాపించబడిన "నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్" ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో, అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు . కొంతమంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వృత్తి విద్య కు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్‌ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు

'సిట్యుయేషన్‌షిప్'

వివాదం..

తమ వివాహ బంధం గురించి భర్త జాకీ భగ్నానీ చేసిన "సిట్యుయేషన్‌షిప్" వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీయడంతో నటి రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా స్పందించింది. బాలీవుడ్‌కి ఈ జంట ఇచ్చిన ఇంటర్వ్యూ-లో చెప్పిన ఒక చిన్న మాటను సందర్భం లేకుండా వాడుతూ.. కేవలం క్లిక్‌బైట్ హెడ్ లైన్స్ కోసం ప్రచారం చేయడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాకీ భగ్నానీ మాట్లాడుతూ.. తాము పెళ్లి చేసుకున్నప్పటికీ ఒక రకమైన 'సిట్యుయేషన్‌షిప్'లో ఉన్నామని, ఒకరికొకరు ఎంతో పారదర్శకంగా, స్వేచ్ఛగా ఉంటామని పేర్కొన్నారు. తమ మధ్య ఎంతటి నిజాయతీ ఉందంటే, ఒకవేళ తన మాజీ గర్ల్‌ఫ్రెండ్ ఫోన్ చేసినా రకుల్ ముందే స్పీకర్ ఆన్ చేసి మాట్లాడతానని ఆయన ఉదాహరణగా వివరించా-రు.అయితే ఈ వ్యాఖ్యలు వైరల్ అవ్వడంతో పాటు కొంచెం వివాదానికి దారి తీశాయి. దీంతో ఈ విషయంపై రకుల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా స్పం-దిస్తూ.. గంటపాటు సాగిన ఈ సంభాషణలో ఒకే ఒక్క లైన్‌ను పట్టుకుని తప్పుడు అర్థం వచ్చేలా హెడ్ లైన్‌స్‌గా మార్చడం విచారకరమని అన్నారు. మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వార్తలను సృష్టించేటప్పుడు విషయం యొక్క లోతును మరియు సందర్భాన్ని అర్థం చేసుకోవాలని, క్లిక్‌బైట్ కోసం బాధ్యతారాహిత్యంగా వ్య-వహరించకూడదని ఆమె సూచించారు. తమ బంధంలోని స్నేహాన్ని, స్వేచ్ఛను ఉద్దేశించి ఆయన ఆ పదాన్ని వాడారే తప్ప, ప్రచారంలో ఉన్నట్లుగా మరొకటి కాదని ఆమె స్పష్టం చేశారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.